RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 2 VOLUME : 2 | సంచిక : 317 ISSUE NO : 317 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, జూన్, 6, 2025 Friday, June,6,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## దక్షిణ కొరియా అధ్యక్షుడిగా లీ జే ప్రమాణస్వీకారం

### అవినీతి, అసమానతలపై పోరు సల్పుతామని ప్రతిన

సియోల్: దక్షిణ కొరియా నూతన అధ్యక్షుడిగా లీ జే మయంగ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బాల్యంలో దుర్భర దారిద్ర్యం నుండి దేశ అత్యున్నత పదవికి ఎదిగిన లీ అసమానతలపై, అవినీతిపై పోరు సల్పుతానని ప్రతిన చేశారు. నేషనల్ అసెంబ్లీలో తొలిసారిగా ప్రసంగిస్తూ ఆయన, చర్చలు, సహకారం ద్వారా కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. ఉత్తర కొరియాతో చర్చలు జరుపుతామన్నారు. అమెరికా, జపాన్‌లతో కలిసి త్రైపాక్షిక భాగస్వామ్యాన్ని పెంపొందిస్తామని చెప్పారు. అమెరికాతో గల వాణిజ్య సమస్యల గురించి లీ నేరుగా ప్రస్తావించలేదు. మందగమనంతో సాగుతున్న దేశీయ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం కలిగించడం తన ప్రథమ ప్రాధాన్యత అని చెప్పారు.



## 25 కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేశాం

### ప్రజల సంక్షేమమే లక్ష్యంగా
### ఎన్‌డిఎ కృషి - ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ వెల్లడి

న్యూఢిల్లీ,జూన్5 : పేద ప్రజల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వెల్లడించారు. ప్రజలను పేదరికం నుంచి బయట పడేయటానికి, వారు స్వయంసమృద్ధి సాధించేందుకు ఎన్‌డీఏ దశాబ్ద కాలంగా సాగిన పాలనలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొన్నట్లు తెలియచేశారు. 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయట పడ్డారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ గౌరవంగా జీవించడానికి వీలుగా.. సమ్మిళిత, స్వయంసమృద్ధి భారత్‌ను తయారుచేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తాము ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదల జీవితాలను మార్చాయన్నారు. పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ వంటివి ప్రజలకు ఇళ్లు, స్వచ్ఛమైన ఇంధనం, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాయి.



## ఆదర్శంగా తెలంగాణ అభివృద్ధి

### రైతులకు అండగా రేవంత్ సర్కార్

**కామారెడ్డి,జూన్5,తెలంగాణ దిశ:** ముఖ్యమంత్రి రేంవత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వంసలహాదారు,మాజీమంత్రి షబ్బీర్ అలీఅన్నారు. తెలంగాన అభివృద్ధి ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు దేశానికి ఆదర్శమని, ఇతర రాష్ట్రాలవారు తెలంగాణను ఆధ్యయనం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలోఅందిస్తున్న పథకాలు,ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఎందుకు లేవో సమాధానం చెప్పాలన్నారు.



## అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కరణ

### రామ దర్బార్ విగ్రహాలకువేదోక్తంగా ప్రాణప్రతిష్ట

**అయోధ్య,జూన్5 :** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో గురువారం మరో అద్భుతం చోటుచేసుకుంది. అంగరంగ వైభవంగా రామమందిర మొదటి అంతస్థులో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాని కి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరయ్యారు. వేద మంత్రోచ్ఛారణ, హవనంతో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి సముదాయంలో రాజారామ్, ఇతర దేవతలను ప్రతిష్టించారు. గతేడాది జనవరిలో జరిగిన మొదటి ప్రాణ ప్రతిష్ఠ తర్వాత జరిగిన రెండవ కార్యక్రమం ఇది.



## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

### ఎన్‌కౌంటర్‌లో మరో అగ్రనేత సింహాచలం మృతి
### నెలలోపే నంబాల తరవాత మరో అగ్రనేత హతం
### సింఆచలంపై కోటి రివార్డు ఉన్నట్లు పోలీసుల ప్రకటన

**రాయ్‌పూర్,జూన్5 :** మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు టెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ గౌతమ్ ఉన్నారు. ఆయన తలపై రూ. కోటి రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు కీలక మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. జిల్లాలో విస్తరించిన నేషనల్ పార్క్‌లో కాల్పులు కొనసాగుతున్నాయి. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భారీగా మావోయిస్టులు ఉన్నట్లు- భద్రతా బలగాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది.
దీంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని గమనించి భద్రతా బలగాలపైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు.
దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి.
పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం ఆయన స్వగ్రామం. కాగా, ఈ ఘటనలో పలు ఆయుధా లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టు అగ్రనాయకుడు నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిన నెలరోజుల్లోపే ఆ పార్టీకి మరో భారీ ఎదురు దెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు- లక్ష్మీ నరసింహాచలం మృతిచెందాడు.



## వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యం


**అమరావతి,తెలంగాణ దిశ:**
వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి పరిధిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మొన్నటి వరకు వనజీవి రామయ్యను చూశామని.. ఆయన లేకపోయినా ఇప్పుడు నల్లమలపరిరక్షణ కోసం అంకారావు కృషిచేస్తున్నారని అన్నారు.
ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని.. దీని పర్యావసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగు తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి చెట్ల వల్ల ఉపయోగం తెలియదని.. వారికి చెట్లు నరకడం తప్ప చెట్లు పెట్టడం తెలియదని విమర్శించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వెళితే కింద రోడ్డుపై చెట్లు నరికేవారని మండిపడ్డారు.



## ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


**హైదరాబాద్,తెలంగాణ దిశ:**
ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా ప్రభుత్వం బాధ్యత, సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల సబ్ కమిటీని, అధికారుల కమిటీని నియమించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై మీ అందరితో చర్చించి సాధ్యమైనం త త్వరగా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా నిర్ణయ ం తీసుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల కమిటీకి సూచించారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉద్యోగుల సమ స్యలపై నియమించిన త్రీమెన్ కమిటీ ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశమై విజ్ఞప్తులను స్వీకరించారు.



## కొండగట్టు వద్ద రోడ్డు ప్రమాదం

**జగిత్యాల,జూన్5,తెలంగాణ దిశ:** జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి పెళ్లి బృందంతో వెళ్తున్న కారు డిసిఎం ఢీకొట్టడంతో ఓచిన్నారి మృతి చెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వరుడు తీవ్రంగా గాయపడడంతో పెళ్లి ఆగిపోయింది. క్షతగాత్రు లను జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెళ్లి బృందం నాందేడ్ నుంచి హుజూరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మూడునెలల చిన్నారి మరణించగా, వరుడు తీవ్రంగా గాయపడ్డాడు. నాందేడ్‌కు చెందిన పెండ్లి బృందం హుజూరాబాద్‌కు కారులో వెళ్తున్నది. అందులో వరుడితో పాటు మరికొందరు ఉన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 4 గంటల సమయంలో కొండగట్టు పంచముఖ ఆంజనేయ స్వామి రోడ్డు సమీపంలో ఓ మామిడికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం.. కారును ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి కారు ముందు భాగంగా నుజ్జునుజ్జు అయింది. దీంతో అందులో ఉన్న పెండ్లికొడుకుతోసహా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మూడు నెలల బాలుడు రుద్ర అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ప్రమాదం నేపథ్యంలో వివాహం నిలిచిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### కారును ఢీకొన్న డిసిఎం..చిన్నారి మృతి
### వరుడికి గాయాలతో ఆగిన పెళ్లి



## అల్వాల్ చెరువులో ఆక్రమణలు..

### హైడ్రా కూల్చివేతలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ:**
హైడ్రా అధికారులు మరోసారి బుల్డోజర్లకు పనిచెప్పారు. అల్వాల్‌లోని చిన్న రాయుని చెరువులో ఆక్రమణలు కూల్చివేస్తు న్నారు. గురువారం ఉదయాన్నే బుల్డోజర్లు, ఎక్స్‌కావేటర్లతో చిన్నరాయుని చెరువు వద్దకు చేరిన హైడ్రా సిబ్బంది చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన భవనాలను నేలమట్టం చేస్తున్నారు. ఇప్పటికే మూడు భవన నిర్మాణాలను కూల్చివేశారు. ఈ క్రమంలో నిర్మాణదారులకు, హైడా అధికారులకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు, హైడ్రా సిబ్బంది అక్కడ మోహరించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో భవన నిర్మాణాలపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో కూల్చివేతలు చేపట్టారు. కాగా, నిజాం కాలంలో 20 ఎకరాల పైచిలుకు విస్తరించిన అల్వాల్ చెరువు.. ఇప్పుడు తొమ్మిదెకరాలకు పరిమితమైపోయింది. మానవ నిర్మితమైన ఈ చెరువు.. ఒకప్పుడు పశువులు, పక్షులకు ఆవాసంగా.. తాగునీటి అవసరాలు తీర్చే కల్పతరువుగా ఉండేది. ఇప్పుడు తన ప్రాశస్త్యాన్ని, ప్రభావాన్ని క్రమంగా కోల్పోతూ వస్తోంది. గృహ సంబంధ వ్యర్థాలు, కాలుష్యకారకాలు పెరిగి.. చెరువు మొత్తం మురికికూపంగా మారిపోయింది. ఆక్రమణలతో కుచించుకుపోయింది.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత






**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 5, (తెలంగాణ దిశ)** :పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ మేడ్చల్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. పర్యావరణ రక్షణ కోసం అందరం కలిసికట్టుగా ముందడుగు వేయాలన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతాయిపల్లిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కేవలం ఒక రోజు కార్యక్రమం కాదని, ప్రతి రోజు మన జీవితంలో ఒక భాగంగా ప్రకృతిని కాపాడటాన్ని ఒక బాధ్యతగా భావించాలన్నారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి మార్గాల ద్వారా మన భూమిని హరిత భూమిగా మార్చాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మల్కాజిగిరి డివిజన్ ఉప అధికారి డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ ప్రకృతిలో ప్రతి అంశం మన జీవనశైలిలో అంతర్భాగమని అన్నారు. చెట్లు, నీటి వనరులు, గాలి ఇవన్నీ మనకు ప్రకృతి ఇచ్చిన అమూల్యమైన బహుమతులన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని, నాశనం చేయకుండా, భవిష్యత్తు తరాల కోసం కాపాడుకుందామని ఆమె సూచించారు. జాతీయ దోమ వ్యాధుల నియంత్రణ కేంద్రం (ఎన్ సివిబిడిసి)జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశమనే పంచభూతాలు మన అసలైన సంపదలన్నారు. మన ఆరోగ్యానికి పర్యావరణం అత్యంత కీలకమన్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించాలంటే, ప్రతి ఒక్కరం బాధ్యత తీసుకొని ప్రకృతిని రక్షించాలని పేర్కొన్నారు. మొక్కలు నాటే అలవాటు ప్రతి ఒక్కరికీ ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెండెంట్ మొహమ్మద్ సలీం, హెల్త్ సూపర్ వైజర్ ఎర్రగిన్నెల విజయ్, ప్రైవేట్ ఆరోగ్య సంస్థల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# భూ భారతి ఆర్జీలను తక్షణమే పరిష్కరించాలి

## - మేడ్చల్ జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి




**మేడ్చల్ కలెక్టరేట్, మే 05, (తెలంగాణ దిశ)** :భూ భారతి రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే ఆర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలని, చొరవ తీసుకొని వారికి అవసరమైన సలహాలు, సూచనలను అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా గురువారం శామీర్ పేట్ మండలంలోని పొన్నాల గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించి రైతులకు ప్రభుత్వంపై భరోసా కల్పించాలని అన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలని అన్నారు. సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్ లో నమోదు చేయాలని, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులు జరుగుతున్న తీరుపై రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
ఆర్జీలను నిర్దేశిత కోడ్‌లలో నమోదు చేయాలని, రైతులకు సంబందిత డాక్యుమెంట్లను జతచేయాలని తెలియజేయాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అయినట్లు దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకోని, ప్రభుత్వ భూముల పరిరక్షణ
కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఆర్జీలు సమర్పించిన ప్రతి దరఖాస్తుదానికి రశీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహాసీల్దారు యాదగిరిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## - కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్







**భద్రాచలం, జూన్ 05, (తెలంగాణ దిశ)** : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిఆర్ పిఎఫ్ కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిఆర్ పిఎఫ్ 212 బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా కిష్టారాం, పైడిగూడెం, పలోడి, పోటక్‌పల్లి, దుబ్బమర్క గ్రామాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి మొక్కలను నాటే కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలన్నారు. పర్యావరణాన్ని రక్షించడంలో యువత కీలక పాత్రను పోషించాలన్నారు. 2025 థీమ్ ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, స్థిరమైన పద్ధతులను అవలంబించాలని కోరారు. ప్లాంటేషన్ డ్రైవ్‌లో అఖండమైన భాగస్వామ్యం చేయించి ప్రతి ఒక్కరూ తన పేరున మొక్కను నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతిజ్ఞ చేయాలన్నారు. పర్యావరణంపై అవగాహన కల్పించి వివిధ రకాల మొక్కలను సమీప గ్రామాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ అజయ్ ప్రతాప్ సింగ్, సునీల్ ఖించి సిఆర్ పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# భీమేశ్వరుని దయ, ఆశీస్సులు ప్రజలపై ఉండాలి






**కుత్బుల్లాపూర్, జూన్ 05, (తెలంగాణ దిశ)** :గాజుల రామారం డివిజన్ శ్రీ బాలాజీ లేఅవుట్ లో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్ట మహెూత్సవానికి గురువారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజీ లే అవుట్ లో నెలకొని ఉన్న మంచినీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి పూర్తి చేశామని అన్నారు. కాలనీలో నేడు ప్రతిష్టాపన చేపట్టనున్న దేవాలయ నిర్మాణంలో కాలనీవాసులు ఐకమత్యంతో ఉండాలని ఆయన సూచించారు. దేవాలయ నిర్మాణం పూర్తి చేయడంలో భీమేశ్వర స్వామి ఆశీస్సులు, నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మధుర మీనాక్షి అమ్మవారి దయ ప్రతి ఒక్కరిపై ఉండాలి

## - ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్, జూన్ 05, (తెలంగాణ దిశ)** :మధుర మీనాక్షి అమ్మవారి దయ ప్రతి ఒక్కరిపై ఉండాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. గురువారం చింతల్ డివిజన్ రొడా మేస్త్రి నగర్ లోని శ్రీశ్రీశ్రీ మధుర మీనాక్షి అమ్మవారి శ్రీ వీరభద్ర స్వామి మందిరంలో జరుగుతున్న బోనాల పండుగ మహెూత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుర మీనాక్షి అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, హైదరాబాద్ నగరంలోని మరే ప్రాంతంలో లేని విధంగా ఏకైక మీనాక్షి అమ్మవారి దేవాలయం ఉండడం, ఆ దేవాలయం మన కుత్బుల్లాపూర్ లో ఉండటం మనందరి అదృష్టంగా భావించాలన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, గాజుల రామారం డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు మక్సూద్ అలీ, బస్వ రాజు, ప్రభాకర్ గుప్తా, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, చెట్ల వెంకటేష్, మూసా ఖాన్, ఇమ్రాన్ బేగ్, తెలంగాణ సాయి, బోయిని మహేష్, ఆంజనేయులు, గోవర్ధన్ రెడ్డి, చిన్నా చౌదరి, బాబీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

## - ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ సీనియర్ నేతలు



**ఉప్పల్, జూన్ 05, (తెలంగాణ దిశ)** :ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు(ప్రొటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావు సూచించారు. గురువారం ఉప్పల్ కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్, జనంపల్లి వెంకటేశ్వర రెడ్డిలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పని తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. పార్టీలో పని చేసిన సీనియర్లకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. పార్టీ కోసం పని చేసే నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న పథకాల అమలు తీరును వారిని అడిగి తెలుసుకున్నారు.

# నాణ్యమైన ఉత్పత్తులు, ఉపాధి కల్పనే ధ్యేయంగా పరిశ్రమలను స్థాపించాలి







**కుత్బుల్లాపూర్, మే 05, (తెలంగాణ దిశ)** :దూలపల్లి పారిశ్రామికవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన "సెవెన్ ఎలెవెన్ టెక్నాలజీస్" వర్క్ షాప్ ను గురువారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తుల ఉత్పత్తితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన ధ్యేయంగా వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసినట్లయితే నిరుద్యోగ సమస్యను తగ్గించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, యువజన అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు సాయి కిరణ్, సెవెన్ ఎలెవెన్ సంస్థ నిర్వాహకులు రాజేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడే హంతకుడు..?

## 'సూట్ కేస్ లో మహిళా శవం' హత్య కేసును ఛేదించిన ఎస్ఓటి పోలీసులు

### - హంతకుడిని పట్టించిన సీసీ ఫుటేజీ

### - నేడు అధికారికంగా వివరాలను వెల్లడించనున్న పోలీసులు



**కుత్బుల్లాపూర్,జూన్ 05, (తెలంగాణ దిశ)** :హైదరాబాద్ బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య గావించబడిన యువతి కేసు మిస్టరీ వీడినట్లు సమాచారం. హతురాలు నేపాల్ కు చెందిన యువతిగా ఎస్ఓటి పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తుంది. అయితే ఆమెని చంపింది యువతి ప్రియుడేనని పోలీసులు భావిస్తున్నారు. సూట్ కేసులో బయట పడిన యువతి మృతదేహం తారతోపా (33) నేపాలీ గా గుర్తించారు. మృతదేహం పోలీసులకు లభించిన ప్రాంతం నుండి చుట్టుపక్కల సిసి ఫుటేజీలను ఎస్ఓటి పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. దీంతో తారా తోపను ఆమె ప్రియుడు విజయ్ (30) చంపి, రెడ్డి ల్యాబ్స్ గోడ వద్ద సూట్ కేసులో కుక్కి పడేసి పోయినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అయితే ఈ విషయ మై బాచుపల్లి పోలీసులు ఇప్పటి వరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. శుక్రవారం ఈ మేరకు డిసిపి విలేకరుల సమావేశం నిర్వహించి అందులో పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం. హత్య గావించబడిన తారతోపా నెల రోజుల క్రితం నేపాల్ నుండి ఆమె ప్రియుడు విజయ్ తో కలిసి నిజాంపేట్ పరిసరాల్లో సహజీవనం చేసినట్లు పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది.

# ఆలయ ప్రాంగణంలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకరిస్తా



**కుత్బుల్లాపూర్, జూన్ 05, (తెలంగాణ దిశ)** :జగద్గిరిగుట్ట కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఫంక్షన్ హాల్ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని బిజెపి నాయకులు జెకె శేఖర్ యాదవ్ తెలిపారు. గురువారం ఫంక్షన్ హాల్ నిర్మించవ తలపెట్టిన స్థలాన్ని సీనియర్ నాయకులు అంజన్ గౌడ్ ఇతర పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.
ఆలయ చైర్మన్ నరేందర్ రెడ్డి, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఇటీవలే నూతన ఫంక్షన్ హాల్ కు భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా గురువారం జెకె శేఖర్ యాదవ్ స్థలాన్ని సందర్శించి, ఫంక్షన్ హాల్ తొందరగా నిర్మాణం కావడానికి తన యొక్క సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సతీష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు గణేష్, ఆలయ డైరెక్టర్లు వేణు గౌడ్, రవి, సునీత, ఇంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ముప్పేట దాడికి భారత్

భారత్ పాకిస్తాన్‌ల మధ్య ఉన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య కేంద్ర హోంశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాల్లో మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఆదేశాల ప్రకారం ప్రజా రక్షణ కోసం సమర్థవం తంగా మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని ఆదేశించింది.హల్గామ్‌లో దాడి చేసిన వారి దాక్కున్న ప్రదేశాలు బయటపడ్డాయి. ఉగ్రవాదుల కోసం అన్వేషణ ఇప్పుడు 54 మార్గాలపై దృష్టి సారించింది. బైసరన్ లోయ నుండి 54 మార్గాలు వేర్వేరు దిశల్లో వెళ్తాయి. ఈ మార్గాల్లో కొన్ని దట్టమైన అడవులు, పర్వతాల వైపు పైకి వెళ్తాయి. మరికొన్ని మార్గాలు మైదానాలలో క్రిందికి వెళ్తాయి. ఈ మార్గాలు కాశ్మీర్‌లోని వివిధ ప్రాంతాలకు అనుసంధానించబడి ఉన్నాయిఈ అటవీ రహదారులలో సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీసుల భారీ ఆపరేషన్ జరుగుతోంది. ఇప్పటికే చాలా మంది ఓవర్ గ్రౌండ్ వర్కర్లను అరెస్టు చేశారు. భద్రతా దళాలు వారిని శోధన కార్యకలాపాల కోసం అడవులకు తీసుకెళ్తున్నాయి. అనేక చోట్ల దాక్కున్న ప్రదేశాలు కూడా కనుగొన్నారు. కానీ చాలా కాలంగా వాటిలో ఎవరూ నివసించడంలేదు. మూలాల ప్రకారం, ఉగ్రవాదులు ప్రస్తుతం అడవిలోని ఒక రహస్య ప్రదేశంలో దాక్కున్నట్లు తెలుస్తోందిఇప్పటివరకు, కేవలం ముగ్గురు ఉగ్రవాదులు మాత్రమే పహల్గామ్ కాల్పుల్లో పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. మిగిలిన కొంతమంది ఉగ్రవాదులు వెనుక నుండి సహకరించినట్లు భావిస్తున్నారు. ఉగ్రవాద దాడికి ముందు, పర్యాటక ప్రదేశాలపై రెక్కీ నిర్వహించిన దుండగులు, అదును చూసి కాల్పులకు తెగబడినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. కాగా, పహల్గామ్‌లో వివిధ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ఇక్కడి వచ్చే వారే లక్ష్యంగా దాడికి పాల్పడ్డారు ఉగ్రవాదులు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి జరిగింది. ఈ దాడిలో నిరాయుధులైన ప్రజలు లక్ష్యంగా చేసుకున్నారు. ఆయుధాలు ధరించిన ఉగ్రవాదులు ప్రజలను వారి మతం గురించి అడిగిన తర్వాత చంపారు. ఈ దాడిలో, 26 మంది అమాయకులైన పర్యాటకులను పొట్టనబెట్టుకున్నారు. ఈ ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకుంది.దీంతో పాటు, ఉగ్రవాద నిర్మూలన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు చేస్తోంది. గతంలో అరెస్టు చేసిన ఓవర్ గ్రౌండ్ వర్కర్లను ఎన్ ఐఏ విచారించి, ఆధారాలను సేకరిస్తోంది. ఇదిలావుంటే, ఇప్పటికే ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించింది. టీఆర్ ఎఫ్ అనేది లష్కరే తోయిబా అనుబంధ సంస్థ. మరో వైపు జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి అనంతరం ఏర్పడిన ఉద్రిక్తల మధ్య భారత్ కు ప్రపంచదేశాల సపోర్టు లభిస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పహల్గామ్ ఉగ్రవాద దాడిని "హీనమైన చర్య"గా కఠినంగా ఖండించారు. ఈ దాడి బాధ్యులైన వారిని శిక్షించి తీరాలని అన్నారు. వ్లాదిమిర్ పుతిన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సోమవారం ఫోన్ చేశారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాద దాడిపై దర్యాప్తులో రష్యా, చైనా ప్రమేయం ఉండాలని పాకిస్తాన్ కోరుకుంది. అయితే అనూహ్యంగా రష్యా భారత్ కు మద్దతు పలికింది. ఫోన్ కాల్‌లో భారతదేశాన్ని సందర్శించాలని ప్రధాని మోడీ ఇచ్చిన ఆహ్వానాన్ని అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారు. ఈ విషయానని అధ్యక్ష అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. రష్యా, భారతదేశం మధ్య సంబంధాలు డైనమిక్‌గా అభివృద్ధి చెందుతున్నాయని ఇద్దరు నాయకులు నొక్కి చెప్పారని క్రెమ్లిన్ తెలిపింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్ అత్యవసర అభ్యర్థన తర్వాత ఐరా భద్రతా మండలి సోమవారం రహస్య సంప్రదింపులు జరపనుంది. ఈ సమావేశం ఉద్రిక్తతలను తగ్గించడంలో సహాయపడుతుందని ప్రస్తుతంకి అధ్యక్షత వహిస్తున్న గ్రీస్ భావిస్తున్నారు ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూనే, పెరుగుతున్న ప్రాంతీయ ఆందోళనలను, భారతదేశం ఆగ్రహాన్ని ఐక్యరాజ్య సమితి పరిగణనలోకి తీసుకోవాల్సింది. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి లష్కర్–ఎ–తోయిబాతో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ పొందినట్లు ప్రకటించింది. తర్వాత దీనిని ఖండించింది. ఈ దాడి తర్వాత భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. భారత్ ఇండస్ వాటర్స్ ఒప్పందాన్ని రద్దు చేయడం, అట్టారీ సరిహద్దు వాణిజ్యాన్ని నిలిపివేయడం, మరియు దౌత్య సంబంధాలను తగ్గించడం వంటి చర్యలు తీసుకుంది. పాకిస్థాన్ ఈ ఉద్రిక్తతలను చర్చించడానికి ఒక అత్యవసర క్లోజ్డ్–డోర్ సమావేశాన్ని కోరింది భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు, ముఖ్యంగా పహల్గామ్ దాడి , దాని తర్వాత భారత్ తీసుకున్న చర్యలు, వీటిలో ఇండస్ వాటర్స్ ఒప్పందం రద్దు మరియు సరిహద్దు వాణిజ్య నిలిపివేత వంటివి చర్చకు వచ్చే అవకాశంఉంది. భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్య దేశాలు. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, యూఎస్ శాశ్వతసభ్య దేశాలు. పాకిస్థాన్ యూఎన్ రిప్రజెంటేటివ్ అసిమ్ ఇఫ్తికర్ అహ్మద్ పహల్గామ్ దాడిలో తమ ప్రమేయం లేదని ఖండిస్తూ, "తటస్థ దర్యాప్తు" కోసం పిలుపునిచ్చారు. భారత్ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చైనా , పాకిస్థాన్ మినహా మిగిలిన భద్రతా మండలి సభ్య దేశాలతో సంప్రదింపులు జరిపారు. భారత్ పాకిస్థాన్ యూఎన్ వేదికను "ప్రచారం" కోసం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. భారత్ రష్యా, ఫ్రాన్స్, యూఎస్, యూకే, దక్షిణ కొరియా వంటి దేశాల నుండి మద్దతు కోరింది. ఎలాగోలా భారత్ తీసుకునే చర్యల నుంచి బయటపడాలని పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది.

# ఈసీఐఎల్ లో తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

## – ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వీఎస్ఎస్ ప్రభాకర్





**కుషాయిగూడ, జూన్ 05, (తెలంగాణ దిశ) :**ఈసీఐఎల్ కంపెనీలో గత కొన్ని సంవత్సరాలుగా తాత్కాలిక ఉద్యోగులుగా పని చేస్తున్న వారిని తక్షణమే పర్మినెంట్ చేయాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఈసీఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం టెక్నీషియన్ రిక్రూట్ మెంట్ పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల యజమాన్యం, బోర్డు చిన్న చూపు చూడడం తగదన్నారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ మజ్దూర్ సంఘ్ రికగ్నైజ్డ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్. సుధీర్ మాట్లాడుతూ ఈసీఐఎల్ చేపట్టిన 45 పోస్టుల టెక్నీషియన్ రిక్రూట్‌మెంట్ పాలసీని నిరసిస్తూ ఆయన పలు డిమాండ్లు చేశారు. ఈసీఐఎల్ లో ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి, డిఓపిటి నిబంధనల ప్రకారం ఇంటర్నల్ వెయిటేజ్ ఇవ్వాలని, గ్రూప్ సి, డి పోస్టులకు రాత పరీక్ష హిందీ, ఇంగ్లీషుతో పాటు రీజినల్ లాంగ్వేజ్ తెలుగును ఆప్షన్ గా ఇవ్వాలని కోరారు.

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను నిలిపివేసి ఓఎంఆర్ షీట్ విధానాన్ని అమలు చేయాలని, వెయిటేజ్ రాత పరీక్షలో థియరీకి 50 శాతం, ప్రాక్టికల్స్‌కు 50 శాతం మార్కులు కేటాయించాలని కోరారు. హైదరాబాద్‌లో మాత్రమే ఎగ్జామ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆఫీస్ బేరర్స్ ఎస్. హనుమంతు, ఆర్. కేశయ్య, టి. గంగానాయక, కె.శారద, జీ. శ్రీనివాస్, ఎస్. గంగాధరన్, జె. రమేష్, పీ. కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై ఆకట్టుకున్న ప్లాస్టిక్ భూతం వేషధారణ, ప్రదర్శన








**కుషాయిగూడ, జూన్ 05, (తెలంగాణ దిశ) :**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాప్రా సర్కిల్ టీఎస్ఐఐసి కాలనీ గ్రౌండ్ లో మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కాప్రా సర్కిల్ అధికారులు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మొక్కలు నాటడంతో పాటు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించడానికి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం యొక్క ఆవశ్యకతను వివరించారు. ర్యాలీలో పారిశుద్ధ్య సిబ్బంది ఎస్ఎఫ్ఏలు డప్పుల వాయిద్యాలతో చిందులు వేస్తూ ప్లాస్టిక్ మహమ్మారి రాక్షసుడి వేషధారణ ప్రదర్శించారు. ప్లాస్టిక్ భూతం వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. జూట్ బ్యాగుల పేపర్ బ్యాగులు, వెదురు, స్టీల్ పాత్రల వాడకం ద్వారా రోజువారి వాడకంలో ప్లాస్టిక్ పాత్రను తగ్గించే విషయాన్ని కాలనీవాసులకు వ్యాపారస్తులకు ప్రదర్శన ద్వారా తెలిపారు. 120 మైక్రాల లోపు ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని అలా విక్రయించి, వినియోగించే వారిపై పెనాల్టీ విధిస్తామని తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ జెవివి కరపత్రాల పంపిణీ






**కుషాయిగూడ, జూన్ 05, (తెలంగాణ దిశ) :**ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించాలనే సందేశంతో పౌరులకు కరపత్రాలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పిట్టల నాగరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈసీఐఎల్ చౌరస్తాలో జన విజ్ఞాన వేదిక కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేసారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించాలనే సందేశంతో పౌరులకు కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్నీ, కాప్రా ప్రధాన కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్, నాయకులు సోమయ్య చారి, దుర్గాచారి, ఉజ్మా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి, జూన్ 05, (తెలంగాణ దిశ) :**టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్‌కూకట్ పల్లి నియోజకవర్గం ఆధ్వర్యంలో బాలా జీనగర్ లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా



కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య రాణి, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు మారుతీ, సీనియర్ మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు స్వరూప గౌడ్, బండి సుధ తదితరులు పాల్గొన్నారు.

# మహేష్ నగర్ లో మైనర్ బాలుడి హత్య

## ప్రేమ వ్యవహారమే హత్యకు కారణమా.?



**కుషాయిగూడ, జూన్ 05, (తెలంగాణ దిశ):** రాచకొండ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏఎస్ రావునగర్ మహేష్ నగర్‌లో గురువారం సాయంత్రం ఒక మైనర్ బాలుడు హత్యకు గురైన సంఘటన చోటు చేసుకుంది. చిన్న తగాదా విషయంలో జవహర్ నగర్ చెందిన అబ్బాయ్ ని నేరేడ్ మేట్ కు చెందిన కొంత మంది అబ్బాయిలు కొట్టడం వల్ల అతను కింద పడిపోయి చనిపోయాడని కుషాయిగూడ పోలీసులు తెలిపారు. అతన్ని సమీపంలోని హాస్పిటల్ కు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు డాక్టర్లు స్పష్టం చేశారు. దీంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కు తరలించారు. ఇందులో చనిపోయిన వ్యక్తి మైనర్ అని, జవహర్ నగర్ పరిధిలోని ప్రగతి నగర్ నివాసిగా గుర్తించారు. కొట్టిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రేమ వ్యవహారమే హత్యకు కారణంగా తెలుస్తుంది. మృతుడు ఎండి. రిజ్వాన్ కుమారుడు ఎండీ. అయాన్ (16)గా స్థానికులు గుర్తించారు.

# నార్త్ లో పలు విమానశ్రయాలు మూసివేత!



న్యూఢిల్లీ:పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ కు శ్రీకారం చుట్టాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 9 ఉగ్రవాద స్థావరాలను విజయ వం తంగా ధ్వంసం చేసింది. ఈ క్రమంలో పాకిస్తాన్, భారత్ మ ధ్య పెరిగిన ఉద్రిక్తతలతో బుధవారం ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలలోని విమానాశ్రయాలు మూసివేయనున్నారు. ఈ మేరకు విమాన ప్రయాణికులకు ఎయిర్ లైన్స్ సంస్థలు సూచనలు చేస్తున్నా యి.ధర్మశాలతో పాటు లేహ్, జమ్మూ, శ్రీనగర్, అమృత్‌స ర్‌తో సహా పలు విమానాశ్రయాలు తదుపరి నోటీసు వచ్చే వరకు మూసివేసి ఉంటాయని స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ ఒక పోస్ట్‌లో తెలిపింది. ఈ సమయంలో రాకపోకలు చేసేవారు ఈ విషయాన్ని గమనించాలని సూచించింది. పలు విమానయాన సంస్థలు ఇదివ రకే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణీకులు ప్రస్తుత పరిణామాలు గమనించి ప్రయా ణాన్ని తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని చెబుతున్నాయి.భారత బలగాల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తరువాత కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ధర్మశాల , లేహ్, జమ్మూ , శ్రీనగర్, అమృత్‌సర్ సహా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలోని విమానాశ్రయాలు తాత్కాలికంగా మూసి వేశారు. తదుపరి నోటీసు వచ్చే వరకు అవి సేవలు అందించవని అధికారులు స్పష్టం చేశారు. వీటి కారణంగా ప్రస్తుత రాకపోకలకు టికెట్లు బుక్ చేసుకున్న వారి జర్నీ ప్రభావితం కావచ్చు. ప్రయాణీకులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవడమే, లేక ప్రత్యామ్నాయం ప్లాన్ చేసుకోవాలని ఎయిర్ లైన్స్ సంస్థల ప్రతినిధులు సూచించారు. దేశంలోని ఎంపిక చేసిన నగరాలకు, అక్కడి నుండి బయలుదేరే ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రయాణికులకు విమాన ప్రయాణానికి సంబంధించి అడ్వైజరీ జారీ చేసింది. శ్రీనగర్, జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాలకు వెళ్లేవారు, అక్కడి నుండి బయలుదేరే విమాన సేవలు అందుబాటులో లేవని ఎక్స్ ఖాతాలో తెలిపింది. విమానాశ్రయానికి చేరుకునే ప్రస్తుత స్థితిని తనిఖీ చేసుకోవాలని విమానయాన సంస్థలు తమ ప్రయాణికులను కోరాయి.

# ఇక రియల్ పరుగులేనా..?

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఆంధ్రుల రాజధాని అమరావతి పునః ప్రారంభ పనులు షురూ అయ్యాయి. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన పనులను తిరిగి పట్టాలెక్కించే పనిలో ఏపీ ప్రభుత్వం పడింది. ఇందులో భాగంగా అమరావతి పునః ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఇందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. భారీ సభా వేదికపై నుంచి కీలకమైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునరుద్ధరణ సహా రాష్ట్ర పరిధిలో రూ. 58,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. అంతేకాదు రాజధాని నిర్మాణానికి పూర్తి మద్దతు ఉంటుందని హామీనిచ్చారు. అమరావతి అంటే కేవలం ఒక నగరం మాత్రమే కాదని? ఒక శక్తి అంటూ వ్యాఖ్యానించారు.రాజధాని పనుల పునరుద్ధరణ పనుల నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వర్గాల్లో మళ్లీ ఆశలు చిగురుస్తున్నాయి. గత ఐదేళ్లలో పూర్తిగా డీలాపడిపోయిన పరిస్థితి ఉండగా? ప్రస్తుతం పునర్ధురణ పనులు జరుగుతుండటంతో పెట్టుబడి పెట్టేందుకుచాలా మంది ఆసక్తి చూపేఅవకాశం ఉందనిరియల్ ఎస్టేట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వం చర్యలు? డెవలపర్ల, ఇన్విస్టెర్లలో అత్మవిశ్వాసాన్ని పెంచే దిశగా ఉన్నాయని అభిప్రాయపడు తున్నారు. అమరావతి నిర్మాణం పునఃప్రారంభంలో భాగంగా అసెంబ్లీ, సచివాల యం, హైకోర్టుభవనాలు,జ్యుడీషియల్ రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణం తో పాటు 5,200 కుటుంబాలకు ఇళ్ల భవనాలు సహా రూ. 49,000 కోట్ల విలువైన 74ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థా పన చేశారు. అమరావతి నగరం కల సాకారమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి పనులు? ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని వేగవంతం చేస్తాయని చెప్పారుకీలకమైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయడంతో ముఖ్యంగా అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగం పునరుద్ధరణకు మంచి అవకాశాలు ఉన్నాయని క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బయన శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు.ఆరు నెలలుగా డెవలపర్లు, ఇన్వెస్టర్లలో సెంటిమెంట్లో సానుకూల మార్పును గమనించామని ఆయన చెప్పారు. ముఖ్యంగా అమరావతి పనులు పట్టాలెక్కడంతో పాటు ప్రభుత్వం తరపున క్రియాశీలక భాగస్వామ్యం ఉండటంతో రియల్ ఎస్టేట్ మార్కెట్ లో స్పష్టత, విశ్వాసం పుంజుకున్నాయని చెప్పారుఅమరావతిలో పెట్టుబడి పెట్టాలంటే అంతకుముందు ఇన్వెస్టర్లలో అనిశ్చితి నెలకొని ఉండేది. ఇన్వెస్టర్లకు తమ పెట్టుబడులు పెరుగుతాయన్న భరోసా ఉండాలి. గతంలో లేకుండేది. ఇప్పుడిప్పుడే స్పష్టత వస్తోంది. పెట్టుబడిదారుల కార్యకలాపాలు పెరగడంతో వచ్చే ఆరు నెలల్లో భూముల ధరలు 15–20 శాతం పెరుగుతాయని ఆశించవచ్చు" అని శ్రీనివాసరావు తెలిపారు.

# సొంత క్యాడర్ నుంచి చికాకులు..?

**విజయవాడ,తెలంగాణ దిశ:** తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ఆర్నెల్లుగా ప్రధాన ప్రతిపక్షం వైసీపీ నుంచి పెద్దగా చికాకులు ఎదురు కాలేదు. ఒకటి రెండు సందర్భాలు వచ్చినా వాటిని సులువుగానే టీడీపీ అధినేత అధిగమించగలిగారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ అధ్యక్షుడు ప్రభుత్వం మీద దూకుడుగా వెళ్లాలని ప్రయత్నించినా ఆ పార్టీ క్యాడర్ పెద్దగా స్పందించలేదు. అధికార పార్టీతో ఎందుకొచ్చిన గొడవ అనుకుని నేతలు కూడా సైలెంట్ అయిపోయారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తుందని చాలా మంది అజ్ఞాతంలోకి జారుకున్నారు.వైసీపీ నుంచి సోషల్ మీడియాలో తప్ప బయట పెద్దగా ప్రతిఘటన లేకపోవడం, ఆ తర్వాత సోషల్ మీడియా దుష్ప్రచారాలను కట్టడి చేయడానికి పెద్ద ఎత్తున పోలీస్ కేసులు నమోదు కావడంతో ప్రత్యర్థుల నుంచి ఆ దూకుడు కూడా తగ్గిపోయింది. ఈ క్రమంలో హుషారుగా ఉండాల్సిన టీడీపీ అధినేతకు సొంత క్యాడర్ నుంచి చికాకులు ఎక్కువయ్యాయి. సోషల్ మీడియాలో ప్రత్యర్థుల కంటే సొంత పార్టీ నాయకులు, పార్టీ అభిమానులు, ప్రతిపక్షంలో ఉండగా టీడీపీని భుజాన మోసిన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికలపై చెలరేగిపోతున్నారు.టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల్లో చాలామంది తాము అధికారంలో ఉన్నామనే సంగతి మరిచి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాలు, సంకీర్ణ ధర్మంలో భాగంగా తీసుకున్న విధానపరమైన అంశాలను కూడా తప్పు పడుతున్నారు. ఐదేళ్ల పాటు టీడీపీ నినాదాల్ని, వాదనల్ని సమర్థవంతంగా వినిపించిన క్యాడర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాక ముందే అసంతృప్తి గళాలను వినిపిస్తున్నారు. కొద్ది మంది వైసీపీని నిందించే క్రమంలో టీడీపీనే తప్పు పడుతున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్న సంగతి మరిచి ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.కొద్ది నెలలుగా టీడీపీ క్యాడర్‌లో ఈ తరహా అసంతృప్తి పెరిగిపోతోంది. పార్టీ అధి నాయకత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందనే భావన కార్యకర్తలు, దిగువ శ్రేణి నాయకుల్లో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన వారు బదులు తీర్చుకోవాలని తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో అలాంటి చర్యలు వద్దని ముఖ్యమంత్రి పదేపదే వారించడం వారికి రుచించడం లేదు. వైసీపీ పంథాలో సాగితే తే?డా ఏముంటుందని, రాష్ట్ర ప్రయోజనాలు అభివృద్ధిపై దృష్టి సారించాలని నచ్చచెప్పే ప్రయత్నాలు వారికి రుచించడం లేదు.ఇక టీడీపీ అనుకూల మీడియాలో సైతం ప్రభుత్వాన్ని ఇరుకున పడేసే కథనాలతో చంద్రబాబు సతమతం అవుతున్నారు. తమ వారనుకునే వారి నుంచి ఎదురవుతున్న విమర్శలు, కథనాలతో చంద్రబాబు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం ఏపీలో బీజేపీ–జనసేనలతో కలిసి టీడీపీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. విధానపరమైన నిర్ణయాలను మూడు పార్టీలు కలిసి తీసుకోవాల్సి వస్తోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, డిప్యూటీ సీఎం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఏపీ ప్రభుత్వంలో ముఖ్య నాయకుడిగా నారా లోకేష్ వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో చాలా వరకు ఆయన భాగస్వామ్యం ఉంటోంది. చంద్రబాబు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకునే క్రమంలో లోకేష్ క్రియాశీలకంగా ఉన్నారు. ప్రభుత్వ శాఖలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ క్రమంలోనే చంద్రబాబు తర్వాత టీడీపీ పగ్గాలు ఏదొ? ఒక సమయంలో లోకేష్ అందిపుచ్చుకోవాల్సి ఉంటుందనే అంచనా అందరిలో ఉంది. అదే సమయంలో టీడీపీ తీరుపై ఆ పార్టీ క్యాడర్ చేస్తోన్నవిమర్శలు, లోపాలను ఎత్తి చూపే క్రమంలో ప్రభుత్వాన్ని నిందిస్తున్న తీరు టీడీపీకి మేలు కంటే చేటు ఎక్కువగా చేస్తున్నాయి.ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేందుకు సోషల్ మీడియాను వాడుకోవడం మొదలైన తర్వాత అన్ని రాజకీయ పార్టీలు గత పదేళ్లుగా సోషల్ మీడియాను విస్తృతంగా వాడుతున్నాయి. సోషల్ మీడియా వినియోగంలో సీబీఎన్ ఆర్మీ పేరిట ఐటీ ప్రొఫెషనల్స్ 2014 ముందు నుంచి విస్తృతంగా పనిచేస్తున్నారు. స్వచ్ఛందంగా చాలామంది చంద్రబాబు కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలపై కాంపెయిన్ చేస్తున్నారు.2019లో టీడీపీ ఓటమి పాలై తిరిగి పుంజుకోడానికి కూడా సోషల్ మీడియా బలంగా పనిచేసింది. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష పాత్ర నుంచి ప్రభుత్వంలో ఉన్నామనే స్పృహలోకి రావడంలో టీడీపీ అనుకూల సోషల్ మీడియా కన్ఫ్యూజ్ అయినట్టు కనిపిస్తోంది. ఇప్పటికీ విధానపరమైన అంశాల్లో లోపాలకు ఆర్నెల్ల క్రితం అధికారం పోగొట్టుకున్న వైసీపీని నిందించే పనిలోనే ఉన్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తప్పు పట్టడంలో వారే ముందు ఉంటున్నారు.మద్యం విక్రయాలు, ఇసుక, బ్యూరోక్రసీ, ప్రభుత్వ సేవలు, విద్యా వైద్యం వంటి అంశాల్లో సొంత పార్టీ వారి నుంచి పలు సందర్భాల్లో విమర్శలు ఎదురవుతున్నా యి. ప్రభుత్వం తమకు నచ్చని ఏ పని చేసినా విమర్శించడానికి వెనుకాడటం లేదు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అధికారుల నియామకాలు, పోస్టింగుల నుంచి ప్రమోషన్లు, బదిలీల వరకు ప్రతి అంశాన్ని తప్పు పట్టడం మొదలైంది. ప్రతి ఒక్కరు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో చంద్రబాబు నిర్ణయాలను నేరుగా విమర్శించడం సాధారణమై పోయింది.

# కాఫీ కొనుగోలులో దోపిడి!



**కాస్త ధర పెంచి తూకంలో, తరుగు పేరుతో భారీగా మోసం**
**జిసిసి నామమాత్రపు పాత్ర - గిరి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు**

**అనకాపల్లి,తెలంగాణ దిశ:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలో కాఫీ పంట కొనుగోలులో ప్రయివేటు వ్యాపారులదే హవా.ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో గిరిజన రైతులను దోపిడీ చేస్తున్నారు. గిరిజన సహకార సంస్థ (జిసిసి) ప్రకటించిన ధర కంటే దళారులు కాస్తధర పెంచినా తూకంలోనూ, తరుగు పేరుతోనూ భారీగా మోసానికి పాల్పడుతున్నారు. దీంతో,గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గిరిజన గ్రామాల్లో ఎవరు ఏధరకు కాఫీ కొం టున్నారో చెప్పే మనుషులను స్థానికంగా దళారులు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ధరకు కొంత పెంచి కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్న వీరు ఎలక్ట్రానిక్ కాటాలో రైతులు పసిగట్టలేని మోసాలకు పాల్పడుతున్నారు. కిలో పార్చ్‌మెంట్ కాఫీకి జిసిసి రూ.400 చెల్లిస్తుండగా, వ్యాపారులు రూ.20, రూ.30 పెంచి ఇస్తున్నారు. అదే సమయంలో ఎలక్ట్రానిక్ కాటాలో కాఫీ పరిమాణాన్ని బట్టి కనీసం ఐదు కేజీలు తక్కువ చూపేలా రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తున్నారు. ఒక తూకంలో ఐదు కేజీలకు రెండు వేల రూపాయల కుపైగా గిరిజనులు నష్టపోతున్నారు. తరుగు పేరిట మరో విధమైన దోపిడీ కొనసాగుతోంది.

70నుంచి 80 కిలోల కాఫీ గింజల బస్తాపై తరుగు కింద2 నుంచి 3కిలోలను ప్రయివేటు వ్యాపారులు తీసేస్తున్నారు. ఆ రకంగా పది బస్తాలు పండించే రైతుకు సగటున 30 కిలోల తరుగు పోతోంది. ఆ లెక్కన రూ.12 వేలు నష్టతున్నారు.

**ఈ ఏడాది ఏం జరుగుతోంది?:**

అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని 2023–24 కంటే 2024–25లో కాఫీ కొనుగోలు ధరను జిసిసి పెంచి చెల్లిస్తోంది. జిసిసి ధర ప్రకటించకముందే దళారులు రంగంలోకి దిగి తక్కువ ధరకు రైతుల నుంచి కాఫీ కొన్నారు. జిసిసి ధర గతం కంటే పెంచడంతో దళారులు కూడా కొంత పెంచి కొనుగోలు చేయడం ప్రారంభించారు. అయితే, పెంచిన ధర కంటే తూకంలో మోసం ద్వారా ఎక్కువ లాభం పొందుతున్నారు. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లోని 11 ఏజెన్సీ మండలాల్లో 2,46,139 మంది రైతులు 2,58,021 ఎకరాల్లో కాఫీ పండిస్తున్నారు. ఏడాదికి 16 వేల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి వస్తున్నప్పటికీ జిసిసి కొనుగోలు వెయ్యి మెట్రిక్ టన్నులు దాటడం లేదు. పార్చ్‌మెంట్ రకానికి పది శాతం, చెర్రీ రకానికి 10.5 శాతం తేమ మించకూడదని కొర్రీలు పెడుతుండడమూ ప్రయివేటు వైపు రైతులు వెళ్లేందుకు ఆస్కారమిస్తోంది.

ఏజెన్సీ కాఫీకి గిరాకీ ఉన్నప్పటికీ..: ప్రకృతి ప్రతికూలతలతో వియత్నాం, బ్రెజిల్‌లో కాఫీ దిగుబడి తగ్గడంతో మన ఏజెన్సీ కాఫీకి మంచి గిరాకీ ఏర్పడింది. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ ఆధారంగా 2024–25 (ఈ ఏడాది) కిలో అరాబికా పార్చ్‌మెంట్ కాఫీకి రూ.400, అరాబికా చెర్రీ రకపు కాఫీకి రూ.250, రొబస్తా చెర్రీకి రూ.160 చొప్పున జిసిసి ధర నిర్ణయించింది. 2023–24 (గతేడాది)లో కిలో పార్చ్‌మెంట్ కాఫీకి రూ.280, చెర్రీకి రూ.145, రొబస్తాకు రూ.70 చొప్పున చెల్లించింది. గతేడాది 565.90 మెట్రిక్ టన్నుల కాఫీని జిసిసి కొనుగోలు చేసింది. ఈ ఏడాది వెయ్యి మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయవచ్చని జిసిసి అంచనా వేసింది. ఈ క్రమంలో 2024 డిసెంబరు చివరి వారం నుంచి కొనుగోలు ప్రారంభించి ఈ ఏడాది మార్చి ఐదు నాటికి 542.754 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. 2022–23లో 996 మెట్రిక్ టన్నుల కాఫీని కొనుగోలు చేసింది. ప్రైవేట్ బ్యాపారుల దోపిడీ నుంచి గిరిజన కాఫీ రైతులను ఆదుకోవడం, జిసిసి కొనుగోళ్లు పెంచడం, అంతర్జాతీయ మార్కెట్ ధరలను బట్టి వాటిని పెంచడమూ అవసరం.

# మద్యపానంతో క్యాన్సర్ ముప్పు

**7రకాల క్యాన్సర్లకు కారణమవుతున్న ఆల్కహాల్**
**దాని సేవనంలో సురక్షిత మోతాదు ఉండదు**
**అమెరికా సర్జన్ జనరల్ నివేదికలో వెల్లడి**



న్యూయార్క్, : సిగరెట్, పొగాకు క్యాన్సర్‌కు కారణమవుతాయనే అవగాహన చాలామందికి ఉంది. అయితే, మద్యం విషయంలో మాత్రం భిన్నమైన మాటలు వినిపిస్తుంటాయి. రోజూ కొంత మోతాదులో మద్యపానం సురక్షితమేనని, రెడ్ వైన్ ఆరోగ్యానికి మేలు చేస్తుందనే రకరకాల ప్రచారాలు ఉన్నాయి. ఈ ప్రచారాలను అమెరికా సర్జన్ జనరల్ తాజా నివేదిక కొట్టిపారేసింది.

మద్యపానంలో సురక్షిత మోతాదు అనేదేమీ ఉండదని, ఎంత తాగినా ఆరోగ్యానికి నష్టం తప్పదని స్పష్టం చేసింది. పొగాకు లాగానే మద్యపానం కూడా క్యాన్సర్‌కు కారణమవుతుందని స్పష్టం చేసింది. మద్యపానంతో క్యాన్సర్ ముప్పుపై శుక్రవారం అమెరికా సర్జన్ జనరల్ డాక్టర్ వివేక్ మూర్తి ఒక నివేదికను విడుదల చేశారు. అమెరికాలో వైద్యపరంగా సర్జన్ జనరల్ హోదా కీలకమైనది. దేశాధ్యక్షుడు స్వయంగా నియమించే సర్జన్ జనరల్.. దేశ ప్రజలకు అవసరమైన ఆరోగ్య మార్గదర్శకాలను జారీ చేస్తారు. 2014 నుంచి అమెరికన్ క్యాన్సర్ సొసైటీతో పాటు వివిధ సంస్థలు క్యాన్సర్‌పై చేసిన అధ్యయనాల ఆధారంగా అమెరికా సర్జన్ జనరల్ ఈ నివేదికను విడుదల చేశారు. మద్యపానం వల్ల రొమ్ము, కొలొరెక్టల్(పెద్ద పేగు), అన్నవాహిక, కాలేయ, నోటి, గొంతు, స్వరపేటిక క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొన్నది. ధూమపానం వల్ల 19 శాతం క్యాన్సర్ కేసులు, 29 శాతం క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయని, అధిక శరీర బరువు వల్ల 7.8 శాతం క్యాన్సర్ కేసులు, 6.5 శాతం క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపింది. ఈ రెండింటి తర్వాతి స్థానంలో మద్యపానం ఉందని, 5.6 క్యాన్సర్ కేసులకు, 4 శాతం క్యాన్సర్ మరణాలకు మద్యపానమే కారణమని వెల్లడించింది. యూవీ రేడియేషన్ కంటే మద్యం వల్లే క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నట్టు తెలిపింది. మహిళలకు ఎక్కువ ముప్పు: అమెరికాలో ఏటా లక్ష క్యాన్సర్ కేసులకు, 20 వేల క్యాన్సర్ మరణాలకు మద్యపానమే కారణమవుతున్నదని ఈ నివేదిక వెల్లడించింది. మద్యపానం చేసే మహిళలకు క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుందని ఈ నివేదిక పేర్కొన్నది. బ్రెస్ట్ క్యాన్సర్ కేసుల్లో దాదాపు 17 శాతం వాటికి మద్యపానం కారణం కావొచ్చని తెలిపింది. మహిళలు వారానికి కేవలం రెండు డ్రింక్స్ తీసుకోవడం వల్ల క్యాన్సర్ ముప్పు పురుషుల కంటే వారిలో ఎక్కువగా ఉంటున్నదని వెల్లడించింది.

# ఉసూరుమనిపించిన ఉలవ..




వరుస కరువుల నేపథ్యంలో జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాగును రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. ఇదే సమయంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. కదిరి నియోజకవర్గం రైతులు అంతర పంటలుగా చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగానే ఎక్కువ మంది ఉలువ పంట సాగు చేశారు. మొదటగా ఉలవ పంట బాగా ఏపుగా పెరిగింది. దీంతో పంట దిగుబడి బాగా వస్తుందని రైతులు భావించారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో వర్షాభావం నెలకొనడంతో దిగుబడిపై ప్రభావం పడింది. దీంతో కనీసం పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది.

సగం పెట్టుబడి కూడా రాని వైనం..!: నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన రైతు నరసింహులు ఆరు ఎకరాల్లో ఉలవ పంట సాగు చేశారు. పంట సాగునిమిత్తం రూ.65 వేల వరకు ఖర్చు చేశారు. ప్రయివేటు వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పు తెచ్చి పంట సాగు చేశారు. దిగుబడి సరిగా లేకపోవడంతో పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. ఉలవలు నాణ్యత లేక, గింజలు తాలుగా ఉండడంతో కొనేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. ప్రస్తుతం పంట నూర్పుడి అనంతరం అమ్మడానికి వెళ్తే క్వింటా రూ.మూడు వేలకు మించి వ్యాపారులు అడగడం లేదు. సాగుకు రూ.65 వేలు ఖర్చు చేస్తే కనీసం రూ.30 వేలకు మించి రాని పరిస్థితి కన్పిస్తోంది. ఈ ఏడాది ఉలవ పంట సాగు చేసిన రైతులందరిదీ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. చాలా మంది రైతులు పంటను పశువులకు మేతగా వదిలేస్తున్నారు. ప్రభుత్వంపై ఆశలు:

ఉలవ సాగు చేసి పెట్టుబడులు కూడా చేతికందకపోవడంతో రైతులు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతుకు పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదు. దీంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పంట చేతికందక పోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపో యారు. పంట సాగు సమయంలో సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ అధికారులు ఉలవ రైతుల గురించి పట్టించుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో టిడిపి కూటమి ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని, పంటనష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# కమలంపై గులాబీ సాఫ్ట్ కార్నర్..!



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** బీజేపీతో వైరం పెంచుకోవద్దని బీఆర్ఎస్ భావిస్తున్నదా? అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. అధికారంలో ఉన్నంతకాలం బీజేపీని తూర్పారబట్టిన గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా గెలవకపోవడంతో సైలెంట్ అయిపోయారు.ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితపై ఈడీ (ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) కేసు నమోదు చేసినప్పుడు రాజకీయంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక ఆడపిల్లపై బీజేపీ కేసు పెట్టించింది, బెదిరింపులకు భయపడేది లేదు, చిల్లర రాజకీయాలతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు అంటూ కేసీఆర్, కేటీఆర్ అనేక సందర్భాల్లో వ్యాఖ్యానించారు. కవిత సైతం బీజేపీ మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ, అదే ఈడీ ఇప్పుడు కేటీఆర్‌పైన ఫార్ములా ఈ ? రేస్ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ (ఈసీఐఆర్) నమోదు చేసి విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసు జారీ చేస్తే ఒక్క మాట కూడా అనలేదు. ఇదే ఇప్పుడు గులాబీ లీడర్లలో చర్చకు దారితీసిందిఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని కేటీఆర్ తరచూ మీడియా సమావేశాల్లో, చిట్‌చాట్‌లలో విమర్శిస్తున్నారు. కానీ, ఈడీ కేసు పెట్టిన విషయంలో, నోటీస్ ఇచ్చిన అంశంలో మాత్రం బీజేపీని పల్లెత్తు మాట అనడం లేదు. కేటీఆర్ మాత్రమే కాకుండా హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలెవ్వరూ బీజేపీపై ఈ విషయంలో కామెంట్ చేయలేదు. భవిష్యత్తులో మరిన్ని ఈడీ కేసులు వస్తాయేమో, బీజేపీని ఇప్పుడు విమర్శిస్తే ఇబ్బందులుంటాయేమో అన్న భయంలో, ఆ పార్టీకి దగ్గర కావాలన్న ఉద్దేశంతో ఇప్పుడు విమర్శలు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారేమో అని గుసగుసలు వినిపిస్తున్నాయి.జనగణనలో కులగణన చేయాలని బీజేపీని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత ఒత్తిడి పెంచుతున్నా బీఆర్ఎస్ నేతలెవ్వరూ బీజేపీని కనీసంగా కూడా ప్రస్తావించడం లేదు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ తీరును తప్పుపట్టిన బీఆర్ఎస్, ఇప్పుడు ఫార్ములా ఈ ? రేస్ విషయంలో భిన్న వైఖరి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కేటీఆర్‌ను ఈడీ చర్యల నుంచి కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే బీజేపీకి ఆగ్రహం కలిగించకుండా ఆచితూచి వ్యవహరిస్తున్నదనే అభిప్రాయాలు గులాబీ లీడర్లలో నెలకొన్నాయి.ఒకే పార్టీలో ఈడీ పట్ల వేర్వేరు సందర్భాల్లో రెండు రకాల పరిణామాలు చోటుచేసుకోవడం పలువురిని ఆచలోనలో పడేసింది. ఎలాగైనా కేటీఆర్‌ను ఈడీ కేసు నుంచి సేవ్ చేసుకోడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నదనే మాటలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నుంచీ బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు, విలీనం చర్చలు జరుగుతూ ఉన్నాయని ఊహాగానాలు బలంగానే వినిపించాయి. సంధి దశలో బీజేపీపై ఎలాంటి కామెంట్లు చేసినా అది ఇబ్బందికి కారణమవుతుందేమోననే ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగానే ఫార్ములా ఈ ? రేస్ విషయంలో ఈడీని, బీజేపీని విమర్శించడం లేదనే మాటలు వినిపిస్తున్నాయి.

# కాల్వ పక్కనే ఉంది..
## పదకొండు ఎకరాలు ఎండింది..!




**చివ్వేంల,తెలంగాణ దిశ:**ఆరుగాలం కష్టపడి యాసంగిలో సాగు చేసిన వరి పొలాలకు ఆదాయం సంగతి పక్కన బెట్టి, ఎంతో కొంత చేతికంది కనీసం పెట్టుబడి పైసలు వచ్చినా చాలు అనుకున్నారు రైతన్నలు. కానీ చివరికి పశువుల మేతకు కూడా పనికి రాకుండా ఎండి పోతుండడంతో అన్నదాతలకు దిక్కుతోచని పరిస్థితి. ఇన్నిరోజులుగా ఎస్సారెస్పి కాల్వకు గోదావరి జలాలు విడుదల చేయకపోవడం, రోజు రోజుకూ ఎండల తీవ్రత అధికమవుతుండడం, ఇప్పటికే చెరువులన్నీ ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు సైతంఆగి ఆగి పోస్తుండడంతో రైతన్నలు దిక్కు తోచని స్థితిలో పడ్డారు. సూర్యాపేట జిల్లా చివ్వేంల మండలంలో ఈ యాసంగి సీజన్‌లో మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలు, తండాల్లో ఎస్సారెస్పి ఆ యకట్టు, దానికి అనుసంధానమైన చెరువుల కింద 24,150 ఎకరాల్లో వరి సాగు చేశారు. అందులో ఇప్పటికే సుమారుగా 1,500 ఎకరాల్లో వరి పూర్తిగా ఎండిపోయింది.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఎస్సారెస్పి ద్వారానీళ్లు అందించకపోతే మరో నాలుగైదు వేల ఎకరాల్లో వరి చేతికందని పరిస్థితి నెలకొంది. 2018 నుంచి 2023 వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగు నీళ్లు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. కాగా ఈ ఏడాది యాసంగి పంటలు పూర్తిగా ఎండిపోయి భారీగా నష్ట పోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. చాలా గ్రామాల్లో ఇప్పటికే పొట్ట దశలో ఉన్న వరి పొలాలు చేతికందకుండా పోయాయి. ఈ ఏడు సాగునీళ్లతో పాటు తాగు నీళ్లకు సైతం తిప్పలు తప్పవని రైతులు గోడు వెళ్లబోస్తున్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: మండలంలోని వల్లభాపురం ఆవాసం జగన్‌నాయక్ తండా శివారులో గత ఎస్సారెస్పి కాల్వను ఆనుకుని ఉన్న 11 ఎకరాల భూమిని రైతు బానోతు పాండు కౌలుకు తీసుకునిసాగు చేశాడు. కాల్వపక్కనే పొలం ఉన్నప్పటికీ చుక్క నీరు అందే పరిస్థితి లేక పొలం ఎండిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఇప్పుడు నీళ్లను వదిలింది. ఈనీళ్లే 20రోజుల కిందే ఇస్తే తన పొలం బతికి చేతికందేదని తెలిపాడు. ఇప్పుడు వస్తున్న నీళ్లు కాల్వకే తడిఆరే పరిస్థితి లేదన్నాడు. ఇప్పటికే రూ.4 లక్షలు అప్పు అయినట్లు తెలిపాడు. పొలం యజమానికి కౌలు చెల్లించక తప్పదని, సాగుకు తెచ్చిన అప్పులుఎట్లా కట్టాలోతెలియని దిక్కుతోచన స్థితిలో ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకుని న్యాయం చేయాలని వేడుకుంటున్నట్లు కోరాడు.

# అంతరిక్షంలోకి చైనా మహిళా వ్యోమగామిని

చైనాతమ దేశం తరపున ఓ మహిళా వ్యోమగామిని తొలిసారి అంతరిక్షంలోకి పంపింది. తాజాగా గన్స్‌ప్రావిన్స్‌లోని జియూక్వియాన్ స్పేస్ సెంటర్‌నుంచి షెంఝూ–19 మిషన్‌లోభాగంగా నేడు ముగ్గురు యువ వ్యోమగాములను అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్‌కు తరలించింది. ఇందుకోసం లాంగ్‌మార్చ్–2ఎఫ్ అనే భారీ రాకెట్‌ను వాడారు. వ్యోమగాముల్లో 34 ఏళ్ల మహిళా స్పేస్ ఫ్లైట్ ఇంజినీర్ వాంగ్ హావూజె కూడా ఉన్నారు. దాదాపు ఆరు గంటల పాటు ప్రయాణించిన వారు స్పేస్ స్టేషన్‌కు చేరుకొన్నారు. వీరు ప్రయాణించిన స్పేస్‌షిప్ అంతరిక్ష కేంద్రం కోర్‌మాడ్యూల్ తియాన్హేతో అనుసంధా నమైంది. ఈ ముగ్గురు వ్యోమగాములు ఆరు నెలలపాటు అక్కడే ఉండి వివిధ ప్రయోగాలను, స్పేస్‌వాక్‌ను నిర్వహిస్తారు. దీనినుంచి వచ్చిన అనుభవంతో 2030 నాటికి చంద్రుడి పైకి యాత్రను చేపడ తారు. ఈ ప్రయోగం విజయవంతమైందని చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ (సీఎంఎస్ఏ) ప్రకటించింది. "వీరు వివిధ రంగాలకు చెందిన మొత్తం 86 ప్రయోగాలు నిర్వహిస్తారు. మా మిత్రదేశాల వ్యోమగాములకు కూడా శిక్షణ ఇచ్చే అంశంపై చర్చలు జరుగుతున్నాయి" అని సీఎం ఎస్ఏ ప్రతినిధి చెప్పారు. ఈ ఏడాది మొత్తం 100అంతరిక్ష ప్రయోగాలు చేసి నాసాను వెనక్కినెట్టాలని



చైనా నిర్ణయించింది. విశ్వాన్ని అన్వేషించి అంతరిక్ష రంగంలో బలమైన శక్తిగా ఎదగాలని రెండేళ్లక్రితమే ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. చైనాలో అంతరిక్ష కార్యక్రమాన్ని సైన్యం నిర్వహిస్తోందని కొన్నేళ్లక్రితం ఆరోపణలు వచ్చాయి. దీంతో బీజింగ్‌నుఅంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) కార్యకలాపాల దూరం పెట్టారు. ఈనేపథ్యంలో సొంతగానే తియాంగాంగ్ పేరిట ఏర్పాటుచేసుకొని ప్రయోగాలు చేపడుతోంది. ఒక దేశం సొం తంగా ఏర్పాటుచేసుకొన్న స్పేస్ స్టేషన్ అది.

# న్యాయమూర్తుల తీర్పుల్లో అభ్యంతరాలు..!

ఈ మధ్య కాలంలో న్యాయవ్యవస్థ విపరీతమైన విమర్శకు గురవుతున్నదనేది వాస్తవం. ఇందుకు కారణం తీర్పులు వెలువరించటంలో జరిగే అసాధారణ జాప్యం. కోర్టు ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత కేసు తీర్పును రిజర్వు చేసి,నెలల తరబడి తీర్పు వెలువరించక పోవడంతో సంబంధిత కక్షిదారులకి ఎవరికీ చెప్పుకోలేని దుస్థితి ఏర్పడుతుంది. సంబంధిత పిటిషన్‌లో వాదనలు ముగిసిన పిదప ఎంత కాలంలోగా హైకోర్టులు తీర్పులు వెలువరించవలసి ఉంటుందనే దానిపై చట్టాలచే నిర్దేశించబడిన నిబంధనలు ఏవీ లేవు. కానీ, ఈ విషయంలో సుప్రీంకోర్టు తన తీర్పుల ద్వారా హైకోర్టులకు స్పష్టంగా ఎన్నోసార్లు మార్గదర్శకాలు సూచించింది. ఒక సందర్భంలో, అలహాబాద్ హైకోర్టు వాదనలు విని తీర్పు వెలువరించక అసాధారణ జాప్యం చేసిన విషయం సుప్రీంకోర్టు దృష్టికి తీసుకపోగా, ఏదేని హైకోర్టు న్యాయమూర్తి వాదనలు ముగిసిన కాలం నుండి ఆరు నెలల్లోగా తీర్పు చెప్పక పోయినట్లయితే, సంబంధిత ప్రధాన న్యాయమూర్తి ఆ కేసును మరో న్యాయమూర్తికి కేటాయించాలని ఉత్తర్వు లిచ్చింది. ఆ న్యాయమూర్తి వాదనలు విని తీర్పు చెప్పాలి. ఇంతవరకు బాగానే ఉంది కానీ, మరో న్యాయమూర్తి ముందు మరోసారి తాజాగా వాదనలు అంటే, కక్షిదారులకు ఖర్చుతో కూడుకున్న పని. ఉదాహరణకు గుజరాత్ హైకోర్టు వెలువరించిన ఒక తీర్పును సుప్రీంకోర్టు ముందుకు కక్షిదారుడు తీసుకుని వెళ్లాడు. ఆ వివరాల్లోకి వెళితే, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి 2023 మార్చి 1న ఒక కేసులో వాదనలు విని ఈ కేసు 'కొట్టివేయబడింది' అంటూ ముగించారు. కానీ కేసును కొట్టివేయడానికి గల కారణాలతో కూడిన తీర్పు వెలువరించే తేదీ విషయం ప్రస్తావించలేదు. తీర్పును కోర్టులో నూ డిక్టేట్ చేయలేదు. ఇదిలా ఉండగా, దాదాపు సంవత్సరం తర్వాత అనగా 2024 ఏప్రిల్ 30 తేదీన కక్షిదారుడికి కారణాలతో కూడిన తీర్పు సాఫ్ట్ కాపీ హైకోర్టు ద్వారా అందించబడింది. అయితే అందులోని తీర్పు తేదీ 2023 మార్చి 1వ తేదీగా ఉంది. కక్షిదారుడు చెప్పిన ఈ వాదనలో నిజా నిజాలు తెలుసుకోడానికి సుప్రీంకోర్టు గుజరాత్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నుండి నివేదిక తెప్పించుకుని పరిశీలించింది. అంతేకాకుండా 2023 సంబంధించి వీడియో రికార్డ్ చేయబడిన కోర్టు ప్రొసీడింగ్స్‌ను కూడా పరీక్షించి, పాత తేదీతో తీర్పును ఏప్రిల్ 30న వెలువరించినట్లు నిర్ధారించింది. దీంతో సుప్రీంకోర్టు ఆ ఆక్షేపిత తీర్పును పక్కకు పెడుతూ, కేసును తాజాగా విచారించి తీర్పు ఇవ్వటానికి మరో న్యాయమూర్తికి కేటాయించాల్సిందని ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే హైకోర్టు కేసులోని వాదనలు ముగిసిన పిదప, సమయాభావం వల్లే, తీర్పులోని తుది ఫలితాన్ని మాత్రమే ప్రకటించాలనే అభిప్రాయానికి వచ్చినట్లయితే, కారణాలతో కూడిన పూర్తి తీర్పును రెండు నుండి ఐదు రోజుల్లో గా ప్రకటించాలని ఆదేశమిచ్చింది. లేదా తీర్పును రిజర్వు చేస్తూ,



6 నెలల్లోగా పూర్తి తీర్పును వెలువరించాలని పేర్కొంది. ఒకవేళ ఇలా జరగకపోతే కక్షిదారులకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా ఒసగిన హక్కును కోర్టు ఉల్లంఘన చేసినట్లవుతుందని అభివర్ణించింది. పైగా హైకోర్టులకు గతంలోనే మార్గదర్శకాలను నిర్దేశించినప్పటికీ మరోసారి గుర్తు చేస్తున్నామని ఒక తీర్పులో ఆవేదన వ్యక్తపరచింది. ఇక కొందరు న్యాయమూర్తులు కేసుల విచారణ సందర్భంలో బహిరంగంగా అనవసర, అభ్యంతరకర వ్యాఖ్యానాలు చేస్తూ ప్రజల దృష్టిలో చిన్న చూపుకు గురవుతున్నారు. ఒకహైకోర్టు న్యాయ మూర్తి ఒక కేసు విచారణ సందర్భంలో, భారత దేశంలోని ఒక భూభాగాన్ని పాకిస్తాన్‌గా అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రతిస్పందిస్తూ హైకోర్టు న్యాయమూర్తులు మాట్లాడే ప్రతి మాట ప్రజలకు కోర్టు ప్రొసీడింగ్స్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా చేరుతుందని, ఒక మతాన్ని లేదా ఒక ప్రాంతాన్ని పక్షపాత వైఖరితోమాట్లాడటం భావ్యం కాదని సలహా ఇచ్చింది. అలాగే ఒక హైకోర్టు న్యాయమూర్తి యువతుల లైంగిక ప్రవర్తనపై తన వ్యక్తిగత అభిప్రాయాన్ని తీర్పులో ప్రస్తావించగా, న్యాయమూర్తులు తీర్పుల్లో కేసుకు సంబంధం లేనితమ వ్యక్తిగత అభిప్రాయాలు పేర్కొనడం సముచితం కాదని సుప్రీంకోర్టు ఆ హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది. అయితే ఈ వ్యాఖ్యలు కేసుకు సంబంధించిన ఆరోగ్యకరమైన వ్యాఖ్యలు అయితే ఎవరూ తప్పు పట్టవలసిన అవసరంలేదని పేర్కొనింది. అదే విధంగా, ప్రతి విషయానికి ప్రభుత్వ అధికారులను కోర్టు ముందు హాజరు కావాల్సిందిగా ఆదేశాలివ్వ టం, తద్వారా ప్రభుత్వ అధికారులరోజువారీ కార్యకలాపాలకు భంగం కలగచేయటం తగదని,అత్యవసరమైతేనే హాజరుకు ఆదేశాలివ్వాలని కోర్టుల తీర్పులు ఉన్నాయి. అలాగే కోర్టులు వెలువరించిన తీర్పు కక్షిదారుడికి అర్థమయ్యే విధంగా ఉండాలే తప్ప,డాంబికమైన ఇంగ్లిషు భాష కాదని గౌరవ సర్వోన్నత న్యాయస్థానం నొక్కి వక్కాణించింది. ఇంగ్లిషు భాషపై పట్టు లేకుండానే ప్రతి ఒక్కరూ జస్టిస్ కృష్ణయ్యర్‌ను అనుకరించాలనుకోవడం లేదా పోటీపడటం ఏ విధంగానూ హర్షించదగిన విషయం కాదు.

# స్పెయిన్‌లో వరద

## కొట్టుకుపోయిన వందలాది కార్లు





స్పెయిన్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దీని కారణంగా పలువురు మృతి చెందగా అనేకమంది ఆచూకీ తెలియరాలేదని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు వరదల్లో వందలాది కార్లు కొట్టుకుపోతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఆకస్మిక వరదలు సంభవించాయి. దీని కారణంగా ఎంతోమంది మృతిచెందారు. ఇప్పటికే వారి మృతదేహాలు కనుగొన్నాం. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి' అని ప్రభుత్వ అధికారి కార్లోస్ మజోన్ పేర్కొన్నారు. మరోవైపు దక్షిణ స్పెయిన్‌లోనూ భారీ వర్షాలు కురిశాయి. దీంతో అక్కడి వీధులు బురద నీటితో నిండిపోయాయి. వరదల కారణంగా పలువురు తప్పిపోయినట్లు అధికార ప్రతినిధి పేర్కొన్నారు. తప్పిపోయిన వారి కోసం డ్రోన్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈనేపథ్యంలో స్పెయిన్ కేంద్రం ఓ సంక్షోభ కమిటీని ఏర్పాటుచేసింది. వారు సమావేశమై పరిస్థితులపై చర్చించారు. 'తప్పిపోయిన వ్యక్తులు, తుపాను కారణంగా సంభవించిన నష్టం గురించి ఆందోళన చెందుతున్నా. అధికారుల సలహాలను ప్రజలు అనుసరించాలి. అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండండి' అని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇదిలాఉండగా.. రాష్ట్ర వాతావరణ సంస్థవాలెన్సియా ప్రాంతంలో రెడ్ అలర్ట్ ప్రకటించింది. దీంతో సిటీ హాల్ అన్ని పాఠశాల తరగతులు, క్రీడా కార్యక్రమాలను నిలిపివేసినట్లు వెల్లడించింది. 12విమానాలను దారి మళ్లించగా..రద్దు చేసినట్లు అధికారులుతెలిపారు. అదేవిధంగా రైళ్ల రాకపోకలనుసైతం నిలిపివేశారు. మరోవైపు అండలూసియాలో276 మంది ప్రయాణికులతో వస్తున్న హైస్పీడ్ రైలు పట్టాలు తప్పింది. అయితే, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని స్థానిక అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉగ్రమూకల పన్నాగాలు..

## భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధమైన ముష్కరులు..!

జమ్ము: భారత్‌లోకి చొరబడేందుకు సుమారు 50 మంది ఉగ్రవాదులు సరిహద్దుల్లో కాచుకొని ఉన్నట్లు భారత్ ఆర్మీ అధికారులు అంచనా వేస్తున్నారు. వారిని మట్టుబెట్టేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయని, ఉగ్రవాదుల ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. ఉగ్రచర్యలను తిప్పికొట్టేందుకు అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. శీతాకాలంలో ప్రతికూల పరిస్థితులు ఉన్నందువల్ల ఉగ్రవాదులు భారత్‌లోకి ప్రవేశించేందుకు ఈ సమయాన్నే అనువుగా భావిస్తారని చెప్పారు. అందుకు తగ్గట్టు సైన్యం కూడా సిద్ధంగా ఉందన్నారు. అఖ్నూర్ సెక్టార్ నియంత్రణ రేఖ సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో భద్రతాబలగాలు మంగళవారం ఉదయం ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి.

ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో జనరల్ కమాండింగ్ ఆధికారి శ్రీవాస్తవ మాట్లాడారు. గత 27గంటల వ్యవధిలో మొత్తం ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ట్లు చెప్పారు. "భారత్‌లోకి చొరబడేందుకు ఉగ్రవాదులు సరికొత్త మార్గాలను ఎంపిక చేసుకుంటున్నారు. మంచు ఎక్కువగా కురుస్తున్న సమయంలోనే వాళ్లు చొరబాటుకు యత్నిస్తున్నారు.



ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకైనా ఇండియన్ ఆర్మీ సిద్ధంగా ఉంది. ఇటీవల నిర్వహించిన ఆపరేషన్లే అందుకు నిదర్శనం" అని చెప్పారు. దక్షిణ పిర్‌పంజాల్ పర్వత శ్రేణిలో సుమారు మంది ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నట్లు అంచనా వేస్తున్నామన్నారు.

# ఈ బెదిరింపులను ఉపేక్షిస్తే భారీ ప్రమాదమే!

గుర్తు తెలియని ఆగంతకుల నుండి మన విమానాలకు ఒక్కసారిగా బాంబులున్నాయని బెదిరింపుకాల్స్ అదేపనిగావస్తూ ఉండటంతో ప్రయాణికులూ,వారి బంధుమిత్రులు,విమానయాన సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ బెదిరింపు కాల్స్‌ను ఫేక్ కాల్స్‌గా భావించి నిర్లక్ష్యమూ చేయలేం..అదే విధంగా పట్టించుకోకుండా ఉండలేం. ఇది ప్రయాణికులభద్రతకూ,ప్రాణాలకు సంబంధించినది. ఇలా మన విమాన వ్యవస్థలకు సవాల్ విసురుతున్న శక్తులను మన పోలీసులు పసిగట్టి త్వరగా వారి ఆచూకీ కనుక్కోవాలి. ఇవి కేవలం ఆకతాయి చేష్టలుగా కనిపించడం లేదు. మన ప్రభుత్వాన్ని అస్థిరపరిచే, చికాకు పరిచే దుశ్చర్యలే. ఈ దుండగులు స్వదేశీయులైనా, విదేశీయులైనా ఈ విషయంలో ఉపేక్ష కూడదు. ఈ సవాల్ మన పాలనా యంత్రాంగం చురుకుతనానికి, రక్షణ సిబ్బంది సామర్థ్యానికి అగ్ని పరీక్షగా భావించాలి. ఒకటి రెండు బెదిరింపు కాల్స్ కావు... వందలాదిగా ఫేక్ బెదిరింపు కాల్స్ రావటం అందర్నీ కలవరపాటుకు గురి చేస్తోంది. పౌర విమానయానరంగం ఇప్పటికే వణికిపోతుండగా, ఒక్కరోజే యాభై బెదిరింపు కాల్స్ రావడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. బాంబు బెదిరింపు కాల్స్ చేసినవారిని వదిలేది లేదని, వారికి జీవిత ఖైదు విధించేలా కఠిన చట్టాలు చేస్తామని, మన ప్రభుత్వం తరపున కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు గట్టిగా చెప్పారు. ఒకపక్కన మన పోలీసులు కేసులు బుక్ చేస్తున్నా వారు బెదరడం లేదు. అంటే, బహుశా వారు శిక్షణ పొందిన తీవ్రవాదులై ఉంటారు. ఏది ఏమైనా వారి బెదిరింపులను తేలికగా తీసుకోలేం. మన ఉపేక్ష భారీ ప్రమాదానికి దారితీయవచ్చు. ప్రాణాలకు విలువకట్టలేము. ఈ విషయంలో నిశితంగాగాలించాల్సిందే. ఏ ప్రమాదం లేదని నిర్ధారించుకున్నాకే విమానాలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలి. మన నిఘా విభాలు,రక్షణ సిబ్బంది అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. ఇది చిన్న విషయం కాదు. కాల్స్ రావడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. బాంబు బెదిరింపు కాల్స్ చేసినవారిని వదిలేది లేదని, వారికి జీవిత





ఖైదు విధించేలా కఠిన చట్టాలు చేస్తామని, మన ప్రభుత్వం తరపున కేంద్రపౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు గట్టిగా చెప్పారు. ఒకపక్కన మన పోలీసులు కేసులు బుక్ చేస్తున్నా వారు బెదరడం లేదు. పిల్లకాయ చేష్టలు కావు. బహుశా విదేశీ తీవ్రవాదుల కుట్రలు కావచ్చు. ఏది ఏమైనా మన రక్షణ సిబ్బంది క్షుణ్ణంగా ప్రయాణికులను, సిబ్బందిని,వారి లగేజీని తనిఖీ చెయ్యాలి. ఈమధ్యనే ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్‌వంత్ సింగ్ పన్నూ..మన ఎయిరిండియా విమానాలలో ఎవరూ ప్రయాణం చేయవద్దు అని హెచ్చరించారు. ఇలాంటి ఖలిస్తానీ తీవ్రవాదులకు మద్దతు, రక్షణ కల్పిస్తున్న కెనడా ప్రభుత్వం ఈ విషయంలో సిగ్గుపడాలి. ఇలాంటి వారిని పెంచి పోషించిన ప్రభుత్వాలు వారి చేతుల్లోనే భంగపడ్డ చారిత్రిక సత్యాలను మరువ కూడదు. ఈ చర్యలు మనకు ఆర్థికంగా నష్టపరచటమే కాక ప్రయాణికులకు భయమూ...వారి కుటుంబాలకు ఆందోళనా కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం చర్యలు, ప్రయత్నాలు త్వరగా ఫలించాలని కోరుకుందాం.

# పెనం మీద నుండి పొయ్యిలోకి..!

ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత కీలకమైన ఔషధాల ధరలు సైతం చుక్కలను దాటి పరుగులు తీస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే 800 రకాల ముఖ్యమైన ఔషధాలను ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ప్రతి సంవత్సరం చోటుచేసుకునే సాధారణ పెంపుగానే దీనిని అప్పట్లో సమర్థించుకున్న ప్రభుత్వం తాజాగా ఎనిమిది రకాల ఔషధాల ధరలను ఏకంగా 50 శాతం పెంచడానికి అనుమ తించింది. ఉబ్బసం, గ్లుకోమా, తలసేమియా,క్షయతో పాటు మానసిక ఆరోగ్య రుగ్మతలతో బాధపడేవారికి అవసరమైన మందు లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగు దలతో దిక్కుతోచక సతమతమౌతున్న దేశ ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం శరాఘాతంగా మారనుంది. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలో 1997లో ఏర్పాటైన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్.పి.పి.ఎ) సాంకేతికంగా ఔషధాల ధరలను నియంత్రిస్తుంది. 'దేశంలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల రీత్యా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనివార్య పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు' ధరల పెంపునకు అనుమతిస్తూ ఆ సంస్థ చేసిన ప్రకటన హాస్యాస్పదం! ఉత్పత్తి వ్యయం పెరగడం, ధరల నియంత్రణ చర్యల కారణంగా ఔషధాలను ఉత్పత్తి చేయడం అసాధ్యంగా మారిందంటూ తయారీదారులు భీష్మించుకు కూర్చోవడమే ఎన్.పి.పి.ఎ చెప్పిన 'అసాధారణ పరిస్థితి'! ఔషధాలను అందుబాటులో ఉంచడానికి ధరలను పెంచడానికి అనుమతివ్వడమే 'ప్రజా ప్రయోజనం'. ఇంతకన్నా అడ్డగోలు వాదన మరోటి ఉంటుందా? 1997లో ఎన్.పి.పి.ఎ ఏర్పాటైన తరువాతనుండి ప్రతిఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ధరలను సమీక్షించి పెంపునకూ అనుమతిస్తూనే ఉంది. దీనికోసం ఔషధాలను ప్రభుత్వం షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ తరగతులుగా విభజించింది. ముఖ్యమైన ఔషధాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చారు. టోకు ధరల సూచిక ఆధారంగా ప్రతీ సంవత్సరం ప్రభుత్వం వీటి ఎగువ సీలింగ్ ధరను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ఈ జాబితాలో 384 ఔషధాలు, నాలుగు వైద్యపరికరాలు ఉన్నాయి. నాన్ షెడ్యూల్డ్ ఔషధాల ధరలను తయారీదారులేకొన్ని నిబంధనలకు లోబడి నిర్ణయించుకోవచ్చు. షెడ్యూల్డ్ ఔషధాల ధరలను నిర్దేశించిన ప్రమాణాల కన్నాఎక్కువగా పెంచాలని తయారీదారులు అడిగిందే తడవుగా కేంద్రం తలూపింది. ఎన్.పి.పి.ఎకున్న ప్రత్యేక అధికారాలను వినియోగించి మరీ ఔషధ తయారీ కంపెనీలకు మేలు చేసింది. ఇలాఉత్పత్తిదారుల ఒత్తిడికి మోడీ ప్రభుత్వం తలొగ్గడం ఇదే మొదటిసారి కాదు. 2019లోనూ, 2021లోనూ ఆర్థిక సం వత్సరాల మధ్యలో ఈ తరహా నిర్ణయాలనే తీసుకుంది.

గత నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నేషనల్ హెల్త్ అకౌంట్స్ నివేదిక ప్రకారం ఆరోగ్యంపై పెడుతున్న ఖర్చులో మూడో వంతు మందులకు అవుతోందని ఆ నివేదిక పేర్కొంది. ఇన్సూర్ టెక్ ప్లమ్ ఇండియా తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో మన దేశంలో వైద్య ద్రవ్యోల్బణం 14 శాతానికి చేరింది. సరైన చర్యలు తీసుకోకపోతే ఇది మరింతగా పెరిగే ప్రమాదం ఉందని ఆ సంస్థ హెచ్చరించింది. ఆన్‌లైన్ బీమా సంస్థ 'పాలసీ బజార్' గణాంకాల ప్రకారం 2019లో



17,900 రూపాయలుగా ఉన్న వార్షిక ఆరోగ్య బీమా పాలసీ ధర ఈ ఏడాది 26,533 రూపాయలకు చేరింది. దీనికి ప్రధాన కారణం ఔషధాల ధరల్లో భారీ పెరుగుదల చోటు చేసుకోవడమేనని ఆ సంస్థ తెలిపింది. పెరుగుతున్న ఔషధాల ధరలు సామాన్యులకు పెనుభారంగా మారుతున్న తీరుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (డి.పి.సి.ఓ) 1979 ప్రకారం ముఖ్యమైన ఔషధాల ధరలను ప్రభుత్వం నియంత్రించేది. నాణ్యమైన, తక్కువ ధరలకు అవసరమైన మందులను ఉత్పత్తి చేసే ప్రభుత్వ రంగం బలంగా ఉండేది. ఆ పరిస్థితి ప్రస్తుతం మారింది. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ రంగాన్ని నీరుగార్చారు.

రోగులు వినియోగదారులుగా మారారు. ప్రైవేటు రంగాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వం వారి చేతిలో కీలుబొమ్మగా మారింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో అన్ని నియంత్రణలను ఎత్తివేసింది. కార్పొరేట్, బహుళజాతి ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యానికి ఔషధ రంగాన్ని వదిలివేసింది. ఫలితం ఏడాదికేడాదికి పెనం మీద నుండి పొయ్యిలోకి పడ్డట్టుగా సామాన్యుల స్థితి తయారవుతోంది. పేదల మూలుగులు పీల్చి కార్పొరేట్లకు దోచిపెడుతున్న ఆ విధానాలను ప్రతిఘటించడమే ఈ సమస్యకు పరిష్కారం.



## ప్రకృతి ప్రసాదం.. ఆరోగ్యానికి వరం

# తాటి ముంజులు





ప్రపంచీకరణ .. కార్పొరేటరీకరణతో ప్రకృతి ప్రసాదించే ప్రతి ఫలంలోనూ కల్తీ చోటు చేసుకుంటుంది. కానీ తాటి ముంజలు స్వచ్ఛతే సొంతం చేసుకుంది. మనకు ప్రకృతి ఇచ్చే పండ్లు, కాయలు ఎన్నో కల్తీలతో మార్కెట్‌లోకి వస్తున్నాయి. కొబ్బరి, మామిడి, సీతాఫలం, జామి, ద్రాక్ష ఇలా అన్నింటికి రసాయనాలు, ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. వాటిపై కార్పొరేట్ దృష్టి పడిన తర్వాత స్వచ్ఛమైనవి లభించడం లేదు. కొన్ని విషపూరితంగా మారుతున్నాయనడంలో సందేహం లేదు.

కానీ ఇప్పటికీ తాటి ముంజు లు స్వచ్ఛం గానే లభిస్తున్నాయి. దీంతో ఆరోగ్య ప్రదాతగా విరజిల్లుతున్నాయి. వేసవి కాలంలో లభించే ఇవి ఎండలు, ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. ఒకప్పుడు వీటి అమ్మకాలకు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం. ఇప్పుడు వీటికి హైదరాబాద్‌లోనూ గిరాకీ ఉంది.

కమాన్ పూర్, : కల్తీ లేనివి మందులు వాడనివి కేవలం తాటికాయలే.. వేసవి వచ్చిందంటే చాలు తాటి చెట్లకు కాయలు విరివిగా కనిపిస్తాయి. ప్రతి ఒక్కరూ తినాలనే తాపత్రయం పడుతుంటారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉండే తాటి ముంజులు ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో సైతం లభ్యమవుతున్నాయి. హైదరాబాద్ నడిబొడ్డులో కూడా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం తాటి ముంజలు విక్రయిస్తున్నారు. ఏ కాలమైనా పెద్దగా ఇబ్బందులుండవు కానీ, వేసవి కాలం వచ్చిందంటే వేసవి తాపానికి భయపడతాం. ఓవైపు భానుడు భగభగ.. మరోవైపు రోడ్లన్నీ నిప్పుల కుంపటిని తలపించేలా సుర్రుమంటాయి. ఇళ్లలో నీడపట్టున కూర్చున్నా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిపోతాం. కాలానికి తగ్గట్టు కమ్మని రుచులను వెంటబెట్టుకు వచ్చే తాటి ముంజలను తింటూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు.

తాటి ముంజ మజాయే వేరు..: వేసవిలో ఎన్ని పళ్లు తిన్నా.. శీతల పానీయాలున్నా.. తాటి ముంజల మజాయే వేరుగా ఉంటుంది. వీటికి ఉండే ఆదరణ అంతా ఇంతా కాదు. తాటి ముంజల ధర కూడా ఏమంత తక్కువ కాదు.. పట్టణ ప్రాంతాల్లో చాలా బాగా డిమాండ్ ఉంది. ఆరోగ్యాన్ని అందించడంలో కూడా తాటి ముంజలు ముందుంటాయి. వేసవిలో మాత్రమే లభించే వీటిని సిప్ చేయకుండా ప్రతి ఒక్కరూ తినాలనుకుంటారు. ప్రతి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పట్టణ ప్రాంతాల్లో తాటి ముంజలకు డిమాండ్ బాగా పెరిగింది. వేసవిలో మాత్రమే లభించడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేయడంతో తాటిముంజలను కొనుగోలు చేయడానికి నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు.

**ఎన్నో లాభాలు:** అమ్మకం దారులు రోడ్డు పక్కనే కూర్చుని అమ్మడం మొదలు పెట్టిన గంటల వ్యవధిలోనే అమ్ముడు పోతున్నాయి. ప్రస్తుతం నగరల్లో ఒక ముంజ పది రూపాయలకు విక్రయిస్తున్నారు. తాటి ముంజల్లో విటమిన్ బీ7, విటమిన్ , సోదెలుర్ ఫైబర్, పొటాషియం, కాల్షియం విసిమిన్- ఎ, ఎమిన్-డి విటమిన్- జింక్, ఐరన్ లతో పాటు న్యూట్రిన్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. వేసవికాలంలో శరీరంలోని లవణ పదార్థాలు చెమట రూపంలో బయటకు వెళ్లిపోతాయి. దీంతో డీహైడ్రేషన్ ఏర్పడి జనం అస్వస్థతకు గురవుతారు. అందుకే ఎండాకాలంలో నీటిని ఎక్కువగా తీసుకోవాలని డాక్టర్లు చెబుతుంటారు. వేసవిలో శరీరానికి నీరు ఒక్కటే సరిపోదు. ఎన్నో రకాల జ్యూస్‌లు, పండ్లు తినాల్ని వస్తుంది. తాటి ముంజలు ఉంటే చాలు ఎంతటి ఎండ తీవ్రతకైనా అలసిపోకుండా యాక్టివ్ గా ఉంటారు. తాటి ముంజల్లో శరీరానికి అవసరమయ్యే మినరల్స్, షుగర్స్ ఉంటాయి. ఇవి శరీరాన్ని బ్యాలెన్స్‌డ్‌గా ఉంచుతాయి.

శరీరానికి చల్లదనాన్ని అందించడంలో అద్భుతంగా సహాయపడతాయి. వేసవి వల్ల ఒంట్లో పెరిగే వేడిని అమాంతం తగ్గించడంలో తాటి ముంజలు ముందుంటాయి. తాటి ముంజల్లో ట్యూమర్లను తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను డెవలప్ చేసే ఫైటోకెమికల్స్ అంథోసాయనిన్లను నిర్మూలిస్తాయి. వీటిని తరచుగా తీసుకుంటే క్యాన్సర్‌కు దూరంగా ఉండొచ్చు. తాటి ముంజల్లో విటమిన్లు, మినరల్స్, ఐరన్, జింక్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

**అనేక రుగ్మతలకు చెక్:** నీటి శాతం ఎక్కువ, క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల అధిక బరువుకు చెక్ పెట్టవచ్చు. తాటి ముంజల్లో పొటాషియం ఎక్కువగా ఉండడంతో రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవచ్చు. పొటాషియం శరీరంలో ఉండే వ్యర్థాలను సమర్థవంతంగా తొలగిస్తుంది. కిడ్నీ లివర్ సమస్యలు కూడా దూరంగా ఉంటాయి. మలబద్ధకంతో ఇబ్బంది పడేవారు తాటి ముంజెలు తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వేసవిలో వచ్చే వేడి వల్ల విరోచనాల సమస్య వస్తూ ఉంటుంది. తాటి ముంజలు తీసుకోవడం వల్ల సమస్యను పరిష్కరించవచ్చు. కడుపు ఉబ్బరం, కడుపులో వికారం, కడుపు నొప్పి, జీర్ణాశయ సమస్యలు కూడా దూరంగా ఉంటాయి. గర్భవతులకు కలిగే కండరాల తిమ్మిర్లు, అలసట తగ్గించడంలో తాటి ముంజలు బాగా సహాయపడతాయి. శరీరానికి మేలు చేసే పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వేసవి కాలంలో మన శరీరం నుండి చెమట బయటకు పోతుంది. శరీరంలోని పోషకాలు చెమట రూపంలో బయటకు పోతాయి. వాటిని భర్తీ చేయడానికి తాటి ముంజలు ఎంతో అవసరం.తాటి ముంజలో తక్కువ మొత్తంలో క్యాలరీలు, ఎక్కువ మొత్తంలో శరీరానికి కావాల్సిన శక్తి ఉంటాయి. కాబట్టి వేసవిలో చలువ కోసం తాటి ముంజల్ని తినడం చాలా అవసరం. కొంతమందికి ఎండాకాలంలో వేడికి ముఖంపై చిన్న చిన్న మొటిమల్లా వస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొందాలంటే కూడా తాటి ముంజల్ని తినాల్సిందే!

**నిర్జలీకరణం నుంచి ఉపశమనం..:** ఎండాకాలంలో ఎన్ని నీళ్లు తాగినా నిర్జలీకరణ అయిపోవడం సర్వసాధారణం. కాబట్టి ముంజల్లో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల వీటిని తింటే ఈ సమస్య నుంచి మనల్ని కాపాడుకోవచ్చు. వేసవిలో శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెరలను ఇవి సమతుల్యం చేస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం శరీరానికి చాలా అవసరం. ఈ పండ్లు ఆకారంలో లీచీ పండును పోలి ఉంటాయి. రుచి లేత కొబ్బరిలా ఉంటుంది.

**గర్భిణులకూ మంచిదే..:** గర్భధారణ సమయంలో కొంతమందికి ఏది తిన్నా జీర్ణం కాకపోవడం లాంటి సమస్య ఎదురవుతుంది. అలాంటి వారు ముంజల్ని తినాలి. ఫలితంగా జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అంతేకాకుండా.. ఈ సమయంలో ఎదురయ్యే మలబద్ధకం, ఎసిడిటీ.. లాంటి ఆరోగ్య సమస్యల్ని కూడా దూరం చేస్తాయి.


**బరువునూ తగ్గిస్తాయి:** తాటి ముంజల్లో శరీరానికి కావాల్సిన ఎ, బి, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్ఫరస్, పొటాషియం.. వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరు ఉండటం వల్ల శరీర బరువును తగ్గించడంలో ఇవి ఎంతగానో తోడ్పడతాయి. అలాగే చికెన్‌పాక్స్‌తో బాధపడే వారికి దురద నుంచి ఉపశమనం అందించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.

**విషపదార్థాలు మాయం..:** తాటి ముంజలు కాలేయ సంబంధ సమస్యల్ని కూడా తగ్గిస్తాయి. ఈ పండులో అధిక మొత్తంలో ఉండే పొటాషియం మన శరీరంలో ఉండే విషపదార్థాలను తొలగిస్తుంది.

**వాంతులయ్యేలా ఉంటే..:** అధిక ఎండ వేడిమికి కొంతమందికి ఒక్కోసారి వాంతులయ్యేట్లు అనిపిస్తుంది. ఇలాంటప్పుడు నిమ్మరసం తాగుతారు. ఒకవేళ నిమ్మరసంతో ఎలాంటి ఫలితం లేకపోతే తాటి ముంజలు తినడం మంచిది. వెంటనే ఆ సెన్సేషన్ నుంచి ఉపశమనం పొందవచ్చు. వేసవిలో అలా కాసేపు బయటికి వెళ్లొస్తేనే అలసిపోతాం కదా! అంతేకాదు.. విపరీతమైన చెమట పోస్తుంది.. ఫలితంగా శరీరం అధిక మొత్తంలో నీటిని కోల్పోతుంది. ఈ క్రమంలో శరీరం కోల్పోయిన నీటిని అందించి, అలసట నుంచి ఉపశమనం పొందడానికి ఒక సులువైన మార్గం తాటి ముంజల్ని తినడం..

**క్యాన్సర్ల నుంచి..:** తాటి ముంజలు.. వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటి వాటిని నిర్మూలిస్తాయి. కాబట్టి ఈ పండుని ఎక్కువగా తినడం వల్ల క్యాన్సర్ల నుంచి కూడా దూరంగా ఉండొచ్చు. శరీరంలో గ్లూకోజ్ స్థాయినిపెంచి..శరీరానికి కావాల్సినమినరల్స్,న్యూట్రియంట్ల శాతాన్ని బ్యాలన్స్ చేయడంలో కూడా ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి.

# ఒత్తయిన జుట్టు కోసం




జుట్టు ఒత్తుగా నిగనిగలాడుతూ ఉండాలని ప్రతిఒక్కరూ ఆశపడతారు. కానీ, నేటి ఉరుకులు పరుగుల జీవితంలో జుట్టుపై శ్రద్ధపెట్టే సమయమెక్కడిదీ? జుట్టు సమస్యలకు ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలెన్నో. చాలామంది జుట్టురాలడం, చుండ్రు వంటి సమస్యలను తగ్గించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. హెయిర్ ప్యాక్‌లు, మసాజ్‌లు, రకరకాల చిట్కాలు పాటిస్తారు. ఒత్తయిన జుట్టుకోసం మీరూ ఓసారి ఇలా ట్రై చేయండి.

క్యారెట్: క్యారెట్ వెంట్రుకలను దృఢంగా ఉంచడంలో తోడ్పడుతుంది. దీనిలో విటమిన్ బీ7 పుష్కలంగా ఉంటుంది. దీన్నే బయోటిన్ అని పిలుస్తారు. ఇది జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అందుకే దీన్ని ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే క్యారెట్‌ని ఉపయోగించి తయారుచేసిన హెయిర్‌ప్యాక్‌ని అప్పుడప్పుడూ వేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందచ్చు. దీనికోసం కొన్ని క్యారెట్ ముక్కలను తీసుకొని నీటిలో వేసి ఉడకబెట్టి మెత్తటి పేస్ట్‌లా తయారుచేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు అప్లై చేసి అరగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. ఈ ప్యాక్ వెంట్రుకలు రాలడాన్ని నియంత్రించి వాటిని దృఢంగా పెరిగేలా చేస్తుంది.

గ్రీన్ టీ: గ్రీన్ టీ తాగడంతో పాటు తలకు ప్యాక్‌లా పట్టించడం వల్ల కూడా జుట్టు రాలే సమస్యను తగ్గించుకోవచ్చు. దీనికోసం నాలుగైదు గ్రీన్ టీ బ్యాగ్‌లను.. అరలీటర్ నీటిలో వేసి వేడి చేయాలి. నీళ్లు చల్లారిన తర్వాత పక్కన పెట్టుకోవాలి. తలస్నానం చేసిన తర్వాత ఈ నీటితో తలను బాగా తడపాలి. పది నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. ఇది మంచి కండిషనర్‌గా పనిచేస్తుంది.

మందారం హెయిర్ ప్యాక్: ముందుగా మందార పూలను రెండు రోజుల పాటు ఎండలో ఆరబెట్టుకోవాలి. పూలతో పొడి చేసుకోవాలి. ఇప్పుడు మూడు టేబుల్ స్పూన్ల పెరుగులో ఓ టేబుల్ స్పూన్ మందారం పొడిని కలపాలి. ఇందులో రోజ్ మేరీ ఎస్సెన్స్ కూడా కలుపుకోవచ్చు. ఇది పింక్ రంగులోకి మారిన తర్వాత తలకు పట్టించి ఆరిన తర్వాత తలస్నానం చేయాలి.

# పర్పుల్ రంగు బెండకాయలను తింటున్నారా.. లేదా..



## తినకపోతే ఈ ప్రయోజనాలను కోల్పోతారు..!

బెండకాయలు మనం తరచూ తినే కూరగాయల్లో ఒకటి. వీటితో కూర, పులుసు, వేపుడు చేస్తుంటారు. చారులోనూ బెండకాయలను వేసి తింటారు. బెండకాయలు ఎంతో రుచిగా ఉంటాయి. వీటితో అనేక రకాల వంటకాలను చేయవచ్చు. అయితే బెండకాయల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో పర్పుల్ కలర్ బెండకాయలు కూడా ఒకటి. ఆకుపచ్చని బెండకాయల తరువాత మనకు ఇవే అధికంగా లభిస్తాయి. పర్పుల్ కలర్ బెండకాయల్లో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందువల్లే ఈ కాయలు ఆ రంగులో ఉంటాయి. ఆంథో సయనిన్స్ అనేవి యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పర్పుల్ కలర్ బెండకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.


ఆర్థరైటిస్ నొప్పులకు..: పర్పుల్ రంగు బెండకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ బెండకాయల్లోని ఆంథో సయనిన్స్ యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటాయి. కనుక ఈ కాయలను తింటే ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వాపులు కూడా తగ్గిపోతాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఈ బెండకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ క్యాన్సర్ గుణాలను కలిగి ఉంటాయి. కనుక ఈ కాయలను తింటే క్యాన్సర్ కణాలు పెరగనీయకుండా అడ్డుకోవచ్చు. పర్పుల్ బెండకాయల్లో మ్యుసిలేజ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జిగురు లాంటి పదార్థం. ఇది మన శరీరంలో చేరితే కొలెస్ట్రాల్‌కు అతుక్కుంటుంది. దీంతో కొలెస్ట్రాల్ తొలగించబడుతుంది. జీర్ణ వ్యవస్థ ద్వారా అది బయటకు వస్తుంది. దీని వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గి గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

షుగర్ ఉన్నవారికి..: ఈ కాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు ఈ బెండకాయలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం పర్పుల్ రంగు బెండకాయలను తినడం వల్ల షుగర్ లెవల్స్‌ను సైతం తగ్గించుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే పలు రకాల సమ్మేళనాలు ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా గ్రహిస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గిపోతాయి. ఈ కాయల్లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. అలాగే షుగర్ లెవల్స్ తగ్గేందుకు కూడా సహాయం చేస్తుంది.

అనేక విటమిన్లు, మినరల్స్..: పర్పుల్ కలర్ బెండకాయలలో అనేక విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఈ కాయల్లో విటమిన్ సి ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్ట పరుస్తుంది. వీటిల్లో ఉండే విటమిన్ కె గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం అవకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ కాయల్లో ఉండే విటమిన్ బి9 (ఫోలేట్)

గర్భిణీలకు ఎంతో మేలు చేస్తుంది. శిశువు ఎదుగుదలకు సహాయపడుతుంది. ఈ బెండకాయల్లో ఉండే విటమిన్ ఎ రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు కంటి చూపును మెరుగు పరుస్తుంది. కణాలు నిర్మాణం అయ్యేలా చూస్తుంది. పర్పుల్ కలర్ బెండకాయల్లో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతాయి. మెటబాలిజం సరిగ్గా ఉండేలా చూస్తాయి. ఇలా ఈ బెండకాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# గర్భం దాల్చిన తొలి నాళ్లలో మహిళల్లో కనిపించే సంకేతాలు, లక్షణాలు ఇవే..!



గర్భం దాల్చడం అన్నది మహిళలకు మాత్రమే లభించిన ఒక గొప్ప వరం. ఈ క్రమంలోనే సంతానం లేని ఎందరో మహిళలు సంతానం పొందేందుకు ఆరాట పడుతుంటారు. ప్రస్తుతం చాలా మంది ఆలస్యంగా వివాహాలు చేసుకుంటున్నారు, దీనికి తోడు హార్మోన్ల సమస్యలు వస్తున్నాయి. కనుక చాలా మంది మహిళలు సంతానం పొందలేకపోతున్నారు. అయితే గర్భం దాల్చిన మహిళలకు మాత్రం మొదటి సారి అయితే లక్షణాలు సరిగ్గా తెలియవు. తాము గర్భం ధరించామని కూడా గుర్తించలేరు. కానీ శరీరం తెలియజేసే కొన్ని సంకేతాలు, లక్షణాలను పరిశీలిస్తే మహిళలకు తాము గర్భం దాల్చారో లేదో అన్న విషయం సులభంగా ఇట్టే తెలిసిపోతుంది. ఆ సమయంలో మహిళల్లో కొన్ని నిర్దిష్టమైన లక్షణాలు కనిపిస్తాయి.

నొప్పులు..: గర్భం దాల్చిన మహిళల్లో చాలా వరకు మొదటి రెండు వారాల వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ కొందరికి మాత్రం పలు లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా శుక్రకణంతో ఫలదీకరణం చెందిన అండం గర్భాశయ గోడకు చేరుతుంది. ఆ సమయంలో కాస్త రక్త స్రావం అవుతుంది. పీరియడ్స్ వచ్చాక లేదా రావడానికి కొన్ని రోజుల ముందు ఇలా జరుగుతుంది. దీన్ని చూసి చాలా మంది మహిళలు నెలసరి సరిగ్గా రావడం లేదని భావిస్తారు. కానీ గర్భం దాల్చారు అన్న విషయాన్ని గుర్తించలేరు. గర్భం దాల్చిన మహిళలకు పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పుల లాంటి నొప్పులు వస్తాయి. దీంతో ఆ నొప్పులను పోల్చులేకపోతారు. ఇలా కూడా వారికి ఆ విషయం తెలియదు.

నీరసం, అలసట..: ఉన్నట్లుండి సడెన్‌గా నీరసం వస్తున్నా, తీవ్రమైన అలసటగా ఉన్నా, విశ్రాంతి తీసుకోవాలని అనిపిస్తున్నా అది గర్భం వచ్చిందన్న విషయాన్ని తెలియజేస్తుంది. అయితే కొందరు మహిళలకు హార్మోన్లలో వచ్చే హెచ్చు తగ్గుల కారణంగా కూడా ఇలా జరుగుతుంది. కనుక ఈ సమస్య ఉంటే డాక్టర్‌ను సంప్రదిస్తే పరీక్ష చేసి సరైన సమస్య నిర్ధారిస్తారు. దీంతో అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవ చ్చు. అలాగే గర్భం దాల్చిన మహిళల్లో కొందరికి స్తనాలు మృదువుగా మారి కాస్త వాపులకు గురైనట్లు అవుతాయి. ముట్టుకుంటే భారంగా అనిపిస్తాయి. కొందరికి ఆ భాగాల్లో సూదులతో గుచ్చినట్లు కూడా అనిపిస్తుంది. నిపుల్స్ ముదురు గోధుమ రంగులోకి మారుతాయి. గర్భం దాల్చిన మహిళలకు పీరియడ్స్ రావు. మహిళలు తమ పీరియడ్‌ను మిస్ అయితే గర్భం దాల్చారేమో చెక్ చేసుకోవాలి. ఇందుకు అవసరం అయితే టెస్టింగ్ కిట్‌ను వాడవచ్చు. కొన్ని సార్లు ఈ కిట్స్ ద్వారా సరైన ఫలితాలు రావు. కనుక డాక్టర్‌ను కలిసి పరీక్ష చేయించుకుంటే మంచిది. అలాగే మూత్ర విసర్జన తరచూ చేయాల్సి రావడం, వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం, ఆహారం బాగా తినాలని అనిపించడం, మూడ్ మారుతుండడం, తలనొప్పి, మలబద్దకం, కడుపు ఉబ్బరం, శరీర ఉష్ణోగ్రతలో తీవ్రమైన హెచ్చు తగ్గులు వెంట వెంటనే రావడం, వాసన చూసే శక్తి పెరగడం, నోట్లో లోహపు రుచి అనిపించడం.. ఇవన్నీ గర్భం దాల్చారని తెలియజేసేసంకేతాలు. అయితేఇవి అందరిలోనూ కనిపించాలని నియమం ఏమీ లేదు.

# గృహ రుణాలపె బీవోబీ శుభవార్త



### వడ్డీరేట్లను 40 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్

### కొత్త రుణాలు 8 శాతం వార్షిక వడ్డీతో ప్రారంభం

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) గృహ రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. గృహ రుణాలపై వడ్డీరేటును ఒకేసారి 40 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు నిర్ణయం తీసుకున్నది. ఈతగ్గింపు కొత్తగా గృహ రుణాలు తీసుకునేవారికి వర్తించనున్నదని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో వేతన జీవులు తీసుకునే రూ.15లక్షలకు పైగా గృహ రుణాలపై వడ్డీరేటు 8 శాతంతో ప్రారంభంకానున్నాయి. గరిష్ఠంగా 9.50 శాతం వసూలు చేస్తున్నట్టు పేర్కొంది. వారి క్రెడిట్ స్కోర్ ఆధారంగా వడ్డీరేట్లను నిర్ణయిం చనున్నట్టు, అలాగే ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఫీజులపై డిస్కౌంట్‌ను కల్పిస్తున్నది. ఇప్పటికే బ్యాంక్ రెపో రేటుతో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును తగ్గించిన విషయం తెలిసిందే. అలాగే మహిళా రుణగ్రహీతలకు 5 బేసిస్ పాయింట్ల రాయితీని కల్పిస్తున్న బ్యాంక్..40 ఏండ్ల లోపు మహిళలు తీసుకునే గృహ రుణాలు, లోన్ ట్రాన్స్‌ఫర్ చేసుకునే వారికి 10 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు బీవోబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ ముదలియర్ తెలిపారు. గృహాలు కొనుగోలు చేసేవారికి తక్కువ వడ్డీకే రుణాలు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అలాగే గత నెలలో మార్జినల్ కాస్ట్ ఆఫ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని కూడా సవరించింది. ఒక్కరోజు కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆ ర్‌ని 8.15 శాతానికి, ఏడాది రుణాలపై 9 శాతంగా నిర్ణయించింది. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్‌లు గృహ రుణాలపై వడ్డీరేట్లను తగ్గించాయి. బ్యాంక్ లాభం రూ.5,048 కోట్లు: బీవోబీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చి త్రైమాసికానికి గాను బ్యాంక్ రూ.5,048 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,886 కోట్లలాభంతో పోలిస్తే కేవలం 3 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.33,775 కోట్ల నుంచి రూ.35,852 కోట్లకు ఎగబాకినట్టు బీఎస్ఈకి సమాచా రం అందించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.92 శాతం నుంచి 2.26 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.68 శాతం నుంచి 0.58 శాతానికి దిగొచ్చాయి. మరోవైపు, 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,38,089 కోట్ల ఆదాయంపై రూ.19,581 కోట్ల నికర లాభాన్ని గడించింది. ప్రతిషేరుకు రూ.8.35 డివిడెండ్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది. నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బ్యాంక్ షేరు కుప్పకూలింది.

# మూడేళ్లలో ముగింపు సాధ్యమేనా..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** అమరావతి రాజధాని రీలాంచ్ పనులు ప్రారంభం కాను న్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన పూర్తయిన తర్వాత పాత డిజైన్లతోనే నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు సంబంధించిన డిజైన్లు పూర్తి కావడంతో పాటు వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో ఇక నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీనులైన వేదిక నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడేళ్లలో అమరావతి రాజధాని పనులను పూర్తి చేస్తామని చెప్పారు. మోదీ కూడా తన ప్రసంగంలో మూడేళ్లలో పూర్తి అవుతుందని తెలిపారు. దీంతో అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యతలన్నీ మున్సిపల్ మంత్రి నారాయణకు చంద్రబాబు నాయుడు అప్పగించారు.అయితే మూడేళ్లలో అమరావతి నిర్మాణపనులు పూర్తి కావడం అంటే ఆషామాషీ కాదు. 365 రోజులు 24 చీ 7 పనిచేసినా సమయం సరిపోతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పునాదులు తీయడం నుంచి నిర్మాణాలు పూర్తి చేయాలంటే అంత సులువు కాదని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఒక్కొక్క టవర్ నిర్మాణం చేయాలంటే ఎంతో సమయం తీసుకుంటుంది. అందుకు అవసరమైన ముడిసరుకుతో పాటు అనుభవజ్ఞులైన ఇంజినీర్లతో పాటు కార్మికులు కూడా అవసరం. అంతా తీసుకున్నా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పరిస్థితులు రాజధాని నిర్మాణ పనులకు తరచూ అంతరాయం ఏర్పరచే అవకాశముందని అంచనాలు వినపడుతున్నాయి వర్షాలు.. తుపానులు... సముద్ర తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం కావడంతో నిత్యం వర్షాలతో పాటు తుపానులు కూడా ఏడాదిలో ఎక్కువ సార్లు వస్తుంటాయి. జులై నెల వచ్చిందంటే ఇక వర్షాలు మామూలుగా పడవు. ఆగస్టు నుంచి కొంత వర్షాల విషయంలో తెరిపి ఇచ్చినప్పటికీ అక్టోబరు, నవంబరు నెలలో తుపానులు పొంచి ఉన్నాయి. సముద్ర తీర ప్రాంతానికి అమరావతి దగ్గరగా ఉండటంతో ఈదురుగాలులతో పాటు భారీ వర్షాలు పడితే పనులకు ఆటంకం ఏర్పడే అవకాశాలున్నాయంటున్నారు. మే నెలలో డిజైన్లు ఖరారయి పనిలో దిగి పునాదులు తవ్వేసరికి జులై వచ్చేస్తుంది. ఇక వర్షాలతో పనులు ముందుకు సాగే అవకాశం లేదు. పోలవరం పనులే పదేళ్ల నుంచి వివిధ ఆటంకాలతో పూర్తి కాకపోవడాన్ని చూసినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. వేసవిలో కూడా అకాల వర్షాలు ముంచెత్తుతున్నాయి. మరో వైపు కృష్ణానదికి వరద ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుంది. వరద వస్తే మాత్రం అమరావతి ప్రాంతంలో నీరు చేరుతుంది. ఇది కూడా పనులకు ఆటంకంగా మారతాయి. వీటికి తోడు పండగలు, పబ్బాలు ఇలా అన్ని కలుపుకుంటూ పోతే మూడేళ్ల సమయం ఇంత పెద్ద సమయంలో పనులు పూర్తి చేయడం సాధ్యం కాకపోవచ్చన్నది ఇంజినీరింగ్ నిపుణుల అంచనా. ఏదైనా ఒక భవనం అయితే పూర్తి చేయవచ్చు కానీ.. యుద్ధ ప్రాతిపదికపై అన్ని హంగులతో బరిలోకి దిగినా ప్రకృతి ఏ మేరకు రాజధాని నిర్మాణానికి సహకరిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ టెన్షన్ రేపుతుంది. అయితే చంద్రబాబు ఆదేశాల మేరకు టెండర్లు దక్కించుకున్న సంస్థలు వీలయినంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్న లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు.

# జగిత్యాలలో కార్యక్రమాలకు మంత్రులు దూరం

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** జగిత్యాల కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డిజీవన్ రెడ్డి అంటే కాంగ్రెస్ అనే చెరగని ముద్ర వేసుకున్నారు. కానీ అధికారంలోకి వ చ్చిన తరువాత జీవన్ రెడ్డికి ఊహించని పరిణామాలు ఎదురవుతు న్నాయి. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను హస్తం పార్టీలో చేర్చుకోవడాన్ని జీవన్ రెడ్డి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఆయనతో కలిసి పని చేయడానికి ససేమిరా అంటుండడంతో రెండు వర్గాలుగా విడిపోయింది జగిత్యాల కాంగ్రెస్. ప్రస్తుతం ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైందట పరిస్థితి.జీవన్ రెడ్డి సీనియర్ నేత కావడంతో ఆయనతో సన్నిహితంగా ఉన్న వాళ్లంతా..ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కి దూరంగా ఉంటున్నారు. అందుకే జీవన్ రెడ్డినికాదని కొంతమంది పార్టీ శ్రేణులు సంజయ్ కుమార్ తో సఖ్యతగా మెదలడం లేదనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవైనా ప్రారంభించాలన్నా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాలన్నా జగిత్యాలకు అమాత్యులు ఆమడ దూరం ఉంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే పొరుగు నియోజకవర్గమైన ధర్మపురి ఎమ్మెల్యే, జగిత్యాల జిల్లా అధ్యక్షుడైన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సైతం జీవన్ రెడ్డి మాట జవ దాటరు. అందుకే జీవన్ రెడ్డి పట్ల విధేయతను ప్రదర్శించే క్రమంలో లక్ష్మణ్ కుమార్..ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ని కలుపుకొని వెళ్లేందుకు సంకోచిస్తుంటారట. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం జీవన్ రెడ్డిని కాదని నియోజకవర్గంలో అడుగు పెట్టే పరిస్థితి లేదట. ధర్మపురి నియోజకవర్గంలో జరిగే ఏదో ఒక అభివృద్ధి పనులకు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, కొండా సురేఖ,
ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవగా..వారంతా జగిత్యాలను టచ్ చేయకుండానే వెళ్లిపోతున్నారట. సంజయ్ కుమార్ ను ఒంటరిని చేయడానికే జీవన్ రెడ్డి మంత్రులను అడుగు పెట్టకుండా చేస్తున్నారనే టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో సాగుతోంది.సీఎం రేవంత్ రెడ్డి మనిషిగానే ఎమ్మెల్యే సంజయ్ కి ముద్ర పడింది. సంజయ్ సైతం నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం నేరుగా సీఎంనే సంప్రదించి నిధులను మంజూరు చేయించుకుంటున్నారట.

దీంతో కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంజయ్ ని పార్టీ నాయకత్వం అక్కున చేర్చుకున్నట్లా లేనట్లా అనే చర్చ జగిత్యాల రాజకీయవర్గాల్లో జరుగుతోంది. ఇద్దరి మధ్య రాజీ కుదర్చడానికి ఎవరూ సాహసించకలేకపోతున్నారట. దీంతో ఇద్దరి మధ్య అంతర్గత విభేధాలు కాస్తా రచ్చకెక్కుతున్నాయి.ఇద్దరు నేతల వ్యవహారంతో స్వపక్షంలో విపక్షంలో మారింది పరిస్థితి. ఒకే జెండా కింద రాజకీయాలు సాగిస్తున్న జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్..వీరిద్దరి చేతులు కలిసేంత వరకు జగిత్యాలలో మంత్రులు అడుగు పెట్టరనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. ఇలా వీరిద్దరు ఎంతకాలమని కలవని రైలు పట్టాల్లా ఉంటారో చూడాలంటూ జిల్లాలో ఉన్న కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నారు. పార్టీ కోసమైనా ఇద్దరూ కలుస్తారా.. లేక ఎప్పటికీ డిష్యూం డిష్యూం అనుకుంటూనే ఉంటారా అనేది చూడాలి.

# నాల్గవ ఆర్ధిక వ్యవస్థగా భారత్

న్యూఢిల్లీ: భారతదేశం 2025లో జపాన్‌ను వెనుకబెట్టి ప్రపం చంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి తన తాజా వరల్డ్ ఎకనామిక్స్‌అవుట్ లుక్ పేరిట నివేదికలో ఈ వాదనను చేసింది. అంచనాల ప్రకారం, భారతదేశం నామినల్ జీడీపీ 2025లో 4.187 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది, ఇది జపాన్ అంచనా వేసిన 4.186 ట్రిలియన్ డాలర్ల జీడీపీ కంటే కొం చెం ఎక్కువ. అంటే ఒక టఫ్ కాంపిటీషన్‌లో భారతదేశం ఇప్పుడు జపాన్‌ను అధిగమిస్తుంది.2024 వరకు భారతదేశం ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది, కానీ ఎ౦ఈ ప్రకారం 2025లో భారతదేశం జపాన్‌ను అధిగమించి నాలుగో స్థానానికి చేరుకుంటుం ది. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు ఇక్కడతో ఆగదు, నివేదిక 2028 నాటికి భారతదేశం జర్మనీని కూడా వెనుకబెట్టి మూడోస్థానంలోని చేరుకుంటుంది. దీంతో మూడో అతి పెద్దఆర్థిక వ్యవస్థగామారుతుందనిచెబుతోంది. భారతదేశం 2027నాటికి 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. నివేదిక 2028 నాటికి భారతదేశం జీడీపీ5.58 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, అదే సమయంలో జర్మనీ జీడీపీ 5.25 ట్రిలియన్ డాలర్లుగా ఉంటుందని చెబుతోంది.2025 టాప్ 10 ప్రపంచ ఆర్థిక వ్యవస్థల జాబితాలో భారతదేశం నాలుగో స్థానంలో ఉంటుంది, దీనివల్ల దాని ఆర్థికస్థాయి మరింత బలపడుతుంది.అంతర్జాతీయ ద్రవ్య నిధి నివేదిక ప్రకారం, అమెరికా 30.5 ట్రిలియన్‌డాలర్ల జీడీపీతో మొదటి స్థానం లో ఉంటుంది, అయితే చైనా 19.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో రెండో స్థానంలో ఉంటుంది. జర్మనీ మూడో స్థానంలో ఉంటుంది, దీని అంచనా వేసిన జీడీపీ 4.74 ట్రిలియన్ డాలర్లు. ఆ తరువాత నాలుగవ స్థానంలోభారతదేశం ఉంటుంది, ఇప్పుడు అంచనా ప్రకారం ఆర్థిక వ్యవస్థ 4.18 ట్రిలియన్ డాలర్లుగా ఉంది.భారతదేశం కంటే కొంచెం వెనుకబడి జపాన్ ఉంటుంది, దీని జీడీపీ 4.18 ట్రిలియన్లు అవుతుంది కానీ ఇదిభారతదేశం కంటే కొంచెం తక్కువగా ఉంటుంది. ఆ తరువాత యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) 3.83 ట్రిలియన్లతో ఆరవ స్థానంలో, ఫ్రాన్స్ 3.21 ట్రిలియన్లతో ఏడవ స్థానంలో, ఇటలీ 2.42 ట్రిలియన్లతో ఎనిమిదవ స్థానంలో, కెనడా 2.22 ట్రిలియన్లతో తొమ్మిదవ స్థానంలో మరియు బ్రెజిల్ 2.12 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో పదవస్థానంలో ఉంటుంది.2025లో కూడాఅమెరికా, చైనా ప్రపంచంలో అతిపెద్ద రెండు ఆర్థిక వ్యవస్థలుగా ఉంటాయి. ఎ౦ఈ దశాబ్దం చివరి వరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని చెబుతోంది. నివేదికలో భారతదేశం వృద్ధి రేటును 2025 కోసం 6.5 శాతం నుంచితగ్గించి 6.2 శాతం చేసిందని కూడా తెలిపింది. దీనికికారణం అమెరికా టారిఫ్ విధానాల వల్ల ఏర్పడిన ఒత్తిడి. అయితే నివేదికలో భారతదేశం వృద్ధి సాపేక్షంగా స్థిరంగా ఉందని, దీనికి ప్రధాన కారణం గ్రామీణ ప్రాంతాలలో ప్రైవేట్ వినియోగం లేదా వ్యక్తిగత ఖర్చుల పెరుగుదల అని కూడా పేర్కొంది.ప్రపంచం గత 80 సంవత్సరాలుగా నడుస్తున్న ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు మారుతోందని హెచ్చరించింది. కొత్త ఆర్థిక వ్యవస్థ ప్రారంభమవుతోంది. ఈ మార్పుల మధ్య భారతదేశం పాత్ర రానున్న సంవత్సరాల?లో మరింత ముఖ్యమైంది అవుతుంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలులో పూర్తిగా విఫలమైంది..!

**జిల్లా కలెక్టర్ ఆర్డీవోలను ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఫోన్లో మాట్లాడిన మాజీ మంత్రి**

**రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాకపోతే దిగిపోవాలి**

**సిద్దిపేటలోని ఇర్కోడ్ అకాల వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం ను పరిశీలించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.**



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైందని అకాల వర్షంతో అన్నదాతలు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో హరిగోశపడుతుంటే అందాల భామల పోటీలను పెట్టి రాష్ట్రంలో పరిపాలనను అస్తవ్యస్తం చేస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాకపోతే ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలగాలని రాష్ట్ర మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు బుధవారం సిద్దిపేట , ఇరుకోడు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అనంత రం ఆయన మాట్లాడుతూ వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్, ఆర్డీవో, సివిల్ సప్లై అధికారులతో ఫోన్ లో హరీష్ రావు మాట్లాడారు. పాలన చేత కాకపోతే దిగిపో అని రేవంత్ రెడ్డి కి హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వడ్ల కొనుగోలు లో పూర్తిగా విఫలం అయిందని,ములుగే నక్కా పై తాటి పండు పడ్డట్టు రైతు పరిస్తితి ఉందని ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక రైతులు అవేదన చెందుతు న్నారని,రేవంత్ రెడ్డి అప్పులు పుట్టడం లేదని మాట్లాడవడం సీఎం గా పెయిల్ అయ్యాడని ఎద్దేవా చేశారు హైదరాబాద్ లో కూర్చొని రోజు అందాల పోటీలపై రేవంత్ రెడ్డి రివ్యూ లు చేస్తున్నాడని అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేక పోయారని గన్ని బ్యాగులు ఇచ్చే పరిస్థితి లో ప్రభుత్వం లేదని హరీష్ రావు మండిపడ్డారు రేవంత్ రెడ్డి చిల్లర మాటలు తగ్గించాలని, కేసీఆర్ ఉన్నపుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలు లో ఇంత ఆలస్యం కాలేదని ప్రభుత్వం రైతుల నుండి తరుగు పేరిట 5కేజిల వడ్లు కట్ చేస్తున్నారని మొలకెత్తిన కూడా కొనడం లేదని రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారు కొనుగోలు కేంద్రాల్లో తిరగాలని ఈ ప్రభుత్వం రైతుల ఉసూరు పోసుకుంటుందిపాలన చేయకుంటే రేవంత్ రెడ్డి దిగిపోవాలని పంట దెబ్బతిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## దేశ సాయుధ బలగాలను చూస్తే గర్వంగా ఉంది

### పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** మన దేశ సాయుధ దళాలను చూస్తే గర్వంగా ఉందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు పాకిస్తాన్ లో భారతదేశం చేసిన త్రివిధ దళాల దాడిని ఆయన ప్రశంసించారు భారతదేశంలో చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సాయుధ దళాల చర్యలకు కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవ మద్దతు ప్రకటించిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా అమలు చేయబడిన తర్వాత పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశ సాయుధ దళాల దైర్య సహసాలను ఆయన ప్రశంసించారు.

# దేశం నుండి ఉగ్రవాదులను ఏరి పారేయాలి!

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** పహల్గాంలో విచక్షణ రహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పే సమయం వచ్చిందని అందుకు దేశ ప్రజలంతా ఏకం కావాలని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ లోని పహల్గాం ప్రదేశానికి వెళ్లిన టూరిస్టులను అతి దారుణంగా కాల్చి చంపిన ఉగ్రవాదులను భారత సైనికులు మట్టుబెట్టాలి అని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కు బుద్ధి వచ్చేలా తీవ్రవాద సంస్థలను ఉగ్రవాదులను ఏరి పారేయాలి అని అన్నారు. ఉగ్రవాదులు తీవ్రవాదులు మన దేశం వైపు చూడాలి అంటేనే శరీరంలో వణుకు పుట్టాలని అన్నారు. భారత్ సైనికులకు దేవుడు అండగా నిలవాలని దేశ ప్రజలంతా పూజలు ప్రార్థనలు చేయాలి అని అన్నారు. రాగ ద్వేషాలు పక్కనపెట్టి కులాలు మతాలు రాజకీయాలకు అతీతంగా ఇలాంటి సమయంలో దేశం వైపు మనమంతా నిలబడాలి అని అన్నారు. ఉగ్రవాదులను చంపే వరకు ఆపరేషన్ సింధూర్ కొనసాగించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కేదారి మధు పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్ నవాజ్ మహేష్ ఫయాజుద్దీన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓవైపు గర్జిస్తున్న మేఘం.. మరోవైపు కంపిస్తున్న భూమి

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణలో రోజున ఆందోళనకర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మేఘుడు గర్జిస్తుండగా.. మరోవైపు భూమి కంపిస్తూ జనాలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. మధ్యాహ్నం వరకు భానుడు నిప్పుల వర్షం కురించగా.. సాయంత్రం సమయంలో ఇక ఇప్పుడు నా వంతు అన్నట్టుగా ఈదురుగాలులను వెంటేసుకుని వరుణుడు ఎంట్రీ ఇచ్చాడు. ఉరుములు మెరుపులతో వరుణుడికి మేఘుడు గట్టిగానే ఎలివేషన్ ఇచ్చాడు. అంతేనా.. భానుడు నిప్పుల వర్షం కురిస్తుంటే.. నేను కేవలం వాన కురిపిస్తే ఎలా అనుకున్నాడో ఏమో.. వడగండ్ల వానతో విరుచుకుపడ్డాడు వరుణుడు. ఇదే సమయంలో రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో భూప్రకంపనలు జనాలను మరింత భయాందోళనలకు గురి చేశాడు. భూప్రకంపనలతో ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారుహైదరాబాద్ నగరంతో పాటు కరీంనగర్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా కరీంనగర్ నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 3 గంటల ప్రాంతంలో ఈదురుగాలులతో మొదలైన వర్షం.. మెల్లగా ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్లుగా మారి బీభత్సం సృష్టించింది. గంటల తరబడి వర్షం కురుస్తూనే ఉండటంతో.. జనాలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షానికి తోడు బలమైన ఈదురుగాలులు వీయటంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది.అక్కడక్కడ పిడుగులు కూడా పడినట్టు సమాచారం. అటు వర్షం తగ్గక.. ఇటు కరెంట్ లేక.. జనాలు ఇక్కట్లు పడ్డారు. కుమురం భీం జిల్లా కేంద్రంలోనూ భారీ వర్షం కురిసింది.ఇక.. హైదరాబాద్‌లో వాతావరణం అనూహ్యంగా మారిపోయింది. మధ్యాహ్నం భగభగమండిన

ఎండ ఒక్కసారిగా చల్లబడి, ఆకాశం నల్లగా కమ్ముకుంది. ఆ తర్వాత మిన్ను విరిగి మీద పడ్డట్టుగా భీకరమైన ఉరుములు, మెరుపులతో వర్షం మొదలైంది.సికింద్రాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అబిడ్స్, కోఠి, బషీర్ బాగ్, పంజాగుట్ట, ఎమ్మెల్యే కాలనీ, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుండపోత వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సరిగ్గా ఆఫీసుల నుంచి ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావటంతో.. తీవ్రంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షంతో ఉక్కిరిబిక్కిరి కాగా.. ఇదే నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో చినుకు కూడా రాలకపోవటం గమనార్హం. హైదరాబాద్‌లో ఉప్పల్ స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ జరుగుతుండగా.. ఆ మ్యాచ్‌కు వర్షం ఎలాంటి ఆటంకం కలిగించకపోవటం ఆశ్చర్యకరం. ఆ ప్రాంతంలో చినుకు కూడా పడకపోవటం విచిత్రమే. కాసేపటికి మళ్లీ అక్కడ కూడా వర్షం అందుకుందనుకోండి.అయితే.. వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురుస్తుండగా.. ఉత్తర తెలంగాణలో మరో భయం వెంటాడింది.

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంచిర్యాల జిల్లాలతో పాటు నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం మండలాల్లో దాదాపు 10 సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

స్థానికులు చెబుతున్న దాని ప్రకారం రెండుసార్లు భూమి కంపించిన అనుభూతి కలిగింది.వర్షం చల్లదనాన్నిస్తే, భూమి కంపించడంతో ప్రజల్లో భయం నెలకొంది. ఈ రెండు అనూహ్య పరిణామాలతో సోమవారం రాత్రి హైదరాబాద్, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో విచిత్రమైన వాతావరణం నెలకొంది.

# మెగాస్టార్ చిరంజీవితో నయన్ వన్స్ మోర్..





నయనతార గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. తనదైన సినిమాలు చేస్తూ తక్కువ సమయంలోనే దక్షిణాదిలో లేడి సూపర్‌స్టార్‌గా పేరును సాధించింది. రెండు దశాబ్దాలుగా సినిమాలు చేస్తూ ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. తెలుగు, తమిళంతో పాటు బాలీవుడ్‌లోనూ హవా కొనసాగిస్తుంది. తాజాగా వార్తల్లో నిలిచింది. మెగాస్టార్ సినిమాలో జతకట్టనున్నది. ఈ ప్రతిష్టాత్మక మూవీకి రూ.18కోట్లు డిమాండ్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్‌లో వార్త తెగ చెక్కర్లు కొడుతున్నది. ఇటీవల నెట్‌ఫ్లిక్స్ 'టెస్ట్'లో నయన్ కనిపించింది. ఈ మూవీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ప్రస్తుతం పెళ్లి చేసుకొని ఇద్దరు కవలలతో సరదాగా గడుపుతూ.. మరో వైపు వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నది. తొలిసారిగా బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్‌తో 'జవాన్' మూవీలో నటించగా.. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీకి రూ.12కోట్ల పారితోషకం అందుకున్నట్లు టాక్. అయితే, ఈ మూవీతో తన మార్కెట్‌ని దృష్టిలో పెంచుకొని రెమ్యునరేషన్‌ను భారీగా పెంచేసినట్లు టాక్. మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కనున్నది. ఈ మూవీలో హీరోయిన్‌గా నయన్‌ను తీసుకోవాలని మేకర్స్ నిర్ణయించారు. ఈ క్రమంలో లేడి సూపర్‌స్టార్‌ను సంప్రదించగా.. మూవీకి రూ.18కోట్లు డిమాండ్ చేసినట్లు టాక్. ప్రస్తుతం నిర్మాతలు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. నయన్ డిమాండ్‌కు నిర్మాతలు తలొగ్గితే.. సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో అత్యధిక పారితోషకం అందుకున్న నటిగా నయన్ నిలువనున్నది.

చిరంజీవి సరసన ఇప్పటికే నయన్ సైరా నరసింహారెడ్డి, గాడ్‌ఫాదర్ సినిమాల్లో నటించిన విషయం తెలిసిందే. ఇద్దరి కాంబినేషన్‌లో మూడో చిత్రం వస్తుందా? లేదా? అనేది త్వరలోనే తేలనున్నది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం నయన్ ఏడు సినిమాల్లో నటిస్తున్నది. టాక్సిక్, మన్నగట్టి సిన్స్ 1960, డియర్ స్టూడెంట్, ఎంఎంఎంఎన్, అమ్మోరు తల్లి-2, హాయ్, రక్కాయి మూవీల్లో నటిస్తున్నది.

# సింగిల్‌గానే ఉన్నా!



'కెరీర్ విషయంలో చాలా సంతోషంగా ఉన్నా. జయాపజయాలు మన చేతిలో ఉండవు. ప్రయత్నించడం వరకే మన పని. ఫలితంతో సంబంధం లేకుండా వృత్తిని ప్రేమిస్తూ ముందుకు వెళ్తున్నా' అని చెప్పింది కథానాయిక కేతిక శర్మ. ఈ భామ శ్రీవిష్ణుతో కలిసి నటించిన తాజా చిత్రం 'సింగిల్' ఈ నెల 9న విడుదలకానుంది. గీతా ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రానికి కార్తీక్‌రాజు దర్శకుడు. ఈ సందర్భంగా మంగళవారం కేతిక శర్మ విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పూర్వ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తను ప్రాక్టికల్‌గా ఆలోచించే స్వతంత్ర భావాలు గల యువతి అని చెప్పింది. ఆద్యంతం చక్కటి వినోదంతో సాగే ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని, హృదయాన్ని తాకే ఎమోషన్స్ కూడా ఉంటాయని తెలిపింది. శ్రీవిష్ణుతో పనిచేయడం హ్యాపీగా ఉందని, తన కామెడీ టైమింగ్ చాలా స్పెషల్ అని కేతిక శర్మ పేర్కొంది. డ్రీమ్ రోల్ గురించి చెబుతూ 'రష్మిక మందన్న ప్రస్తుతం గీతా ఆర్ట్స్‌లో 'గర్ల్‌ఫ్రెండ్' సినిమా చేస్తున్నది. అందులో ఆమెది అద్భుతమైన పాత్ర. ఆ తరహా క్యారెక్టర్ చేయాలన్నది నా డ్రీమ్. సాయిపల్లవి, కీర్తి సురేష్ మాదిరిగా పర్‌ఫార్మెన్స్ స్కోప్ ఉన్న రోల్స్ కోసం ఎదురుచూస్తున్నా' అని చెప్పింది. తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి మాట్లాడుతూ 'ప్రస్తుతానికైతే సింగిలే. మనసుకు నచ్చినవారు తారసపడితే ప్రేమలో పడతానేమో? ఇప్పుడు నా దృష్టంతా కెరీర్ మీదే ఉంది' అని చెప్పుకొచ్చింది.

# నిర్మాత కష్టాలేమిటో తెలిసొచ్చాయి!




'నటిగా 15 ఏళ్ల కెరీర్ పూర్తయింది. ఈ ప్రయాణంలో ఎంతో మంది అభిమానాన్ని సంపాదించుకున్నా. అయినా ఇంకా ఏదో చేయాలనే తపన నన్ను వెంటాడేది. ఇండస్ట్రీలో ఇంత అనుభవం ఉంది కాదా అనే ధీమాతో నిర్మాతగా మారాను' అని చెప్పారు అగ్ర కథానాయిక సమంత. ట్రా లా లా పేరుతో నూతన నిర్మాణ సంస్థను ప్రారంభించిన ఆమె తొలి ప్రయత్నంగా తెరకెక్కించిన 'శుభం' చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం సమంత పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు.. నటిగా శుక్రవారం ఎలా ఉంటుందో నాకు అనుభవం ఉంది. కానీ నిర్మాతగా నాకిది మొదటి శుక్రవారం. చాలా ఒత్తిడిగా ఫీలవుతున్నా. నిర్మాతకు ఎన్ని కష్టాలు ఉంటాయో ఇప్పుడు నాకు అర్థమవుతున్నది. వారం రోజులుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నా. లొకేషన్‌లో ఒక్క సీన్ అనుకున్నట్లుగా రాకపోతే నిర్మాతకు ఎంత నష్టం వస్తుంది? ఎంత డబ్బు వృథా అవుతుందో ఇప్పుడు ప్రత్యక్షంగా తెలుసుకున్నా.

ఈ సినిమా కథ సీరియల్స్ చుట్టూ నడుస్తుంది. సీరియల్స్‌లో శుభం కార్డు ఎప్పుడు పడుతుందా అని అందరూ ఎదురుచూస్తుంటారు. అందుకే అదే టైటిల్ పెట్టాం. ఇక ప్రొడక్షన్ హౌస్‌కు ట్రా లా లా అనే పేరు పెట్టడానికి ఓ కారణం ఉంది. చిన్నప్పుడు స్కూల్లో 'బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్' అనే ఓ పోయెమ్ ఉండేది. అందులోని వాక్యాల్ని తీసుకొని బ్యానర్ పేరు పెట్టాను. నాకు నేనే పెద్ద విమర్శకురాలిని. సినిమా విషయంలో ఎక్కడ తప్పు చేశానో వెంటనే తెలిసిపోతుంది.'శుభం' విషయంలో అలాంటి తప్పులు జరగకూడదని అనుకున్నా. ఫస్ట్‌సీన్ నుంచి లాస్ట్ సీన్ వరకు ఎక్కడా బోర్ కొట్టకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇది హారర్ కామెడీ చిత్రం. ఇందులో సోషల్ సెటైర్ కూడా ఉంటుంది.ఈ మధ్య ఓ అభిమాని నాకోసం గుడి కట్టారని తెలిసింది. నా మీద ఇంత ప్రేమ చూపిస్తున్నారా?

# కాంతార 2 షూటింగ్‌లో అపశృతి..






కాంతార చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఎంత ప్రభంజనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కన్నడలో విడుదలైన 'కాంతార' రికార్డుస్థాయి వసూళ్లను రాబట్టి అందరిని ఆశ్చర్యపరిచింది. రిషబ్ శెట్టి ఈ సినిమాలో హీరో మాత్రమే కాదు, రచయిత %-% దర్శకుడు కూడా ఆయనే. తొలి పార్ట్ మంచి సక్సెస్ కావడంతో ఇప్పుడు రెండో పార్ట్‌ని 'కాంతార: చాప్టర్ 1' పేరుతో తెరకెక్కిస్తున్నారు. ఈ సీక్వెల్‌ను అక్టోబర్ 2, 2025న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటన చేశారు. కాంతార సినిమా 2022 సెప్టెంబర్ చివర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. సరిగ్గా మూడు సంవత్సరాల తర్వాత కాంతార ప్రీక్వెల్ రాబోతుంది. కాంతార సినిమాకి సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్ చేస్తున్న నేపథ్యంలో మూవీపై ఆసక్తి పెరిగింది. అయితే 'కాంతార: చాప్టర్ 1' చిత్ర బృందానికి ఇటీవల ప్రమాదాల ఎక్కువ అవుతుండడం మనం చూస్తూ ఉన్నాం. కొన్ని రోజుల క్రితం కొల్లూరులో జూనియర్ ఆర్టిస్టులతో వెళ్తున్న బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొందరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఆ తరువాత గాలి వానకు భారీ ఖర్చుతో నిర్మించిన సెట్ పూర్తిగా ధ్వంసం కావడం మనం చూశాం. ఇక తాజాగా సినిమా షూటింగ్‌లో జూనియర్ ఆర్టిస్ట్ కన్నుమూయడం ఇప్పుడు విషాదంలోకి నెట్టేసింది.. 'కాంతార: చాప్టర్ 1' సినిమా కోసం పనిచేస్తోన్న కేరళకు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి చనిపోయాడు. ఉడిపి జిల్లా బైందూర్ లోని కొల్లూరులో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తుంది. షూటింగ్ ముగిసిన తర్వాత కపిల్ తన బృందంతో కలిసి కొల్లూరులోని సౌపర్ణిక నదిలో ఈతకు వెళ్లాడు. నీటి లోతు అంచనా వేయలేక నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తుంది.

కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జూనియర్ ఆర్టిస్ట్ మరణంతో చిత్ర బృందం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. ఈ సంఘటన గురించి మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. దీనిపై చిత్ర బృందం ఒక అధికారిక ప్రకటన వెలువరించనుందని సమాచారం.

# తెలంగాణ ముద్దుబిడ్డ.. కరీంనగర్ రైతుబిడ్డ..



తినే తిండిలో విషం లేనిది ఏదైనా ఉందాని వెతుక్కుంటూ పోతే.. రసాయనాలతో కల్తీ కానిదేదీ కనిపించలేదు. మంచి తిండే లేని చోట బిడ్డల్ని పెంచడం ద్రోహమే అనిపించింది అతనికి.సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొలువుని, విలాసాల నగరాన్ని వదిలి సొంతూరుకు బయలెల్లాడు. వ్యవసాయం మొదలుపెట్టాడు. విఫలమయ్యాడు. నష్టపోయాడు. మళ్లీ మళ్లీ ప్రయత్నించి సఫలమయ్యాడు. నేలను, తిండిని విషతుల్యం చేస్తున్న రసాయన వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా లాభసాటి సేంద్రియ పద్ధతులకు దారి వేశాడు. ఆ చాళ్లలో పెరిగిన పైరు రైతులకు లాభసాటి మార్గమైంది. శాస్త్రవేత్తలకు ఒక పాఠమైంది. ఆ రైతును ఫెలో ఫార్మర్ అవార్డ్ విజేతని చేసింది. ఈ అవార్డుకు ఎంపికైన ఆరుగురిలో దక్షిణ భారత దేశం నుంచి ఎంపికైన ఒకే ఒక్కడు మావురం మల్లికార్జున్ రెడ్డి. అతను రైతుబిడ్డే కాదు, తెలంగాణ ముద్దుబిడ్డ కూడా!

మాది వ్యవసాయ కుటుంబం. కరీంనగర్ జిల్లా పెద్దకుర్మపల్లి మా ఊరు. మాకు పదహారు ఎకరాల భూమి ఉంది. మా నాన్న మావురం లక్ష్మారెడ్డి ఆదర్శ రైతు. కొత్త పద్ధతుల్లో పత్తి సాగు చేసి అధిక దిగుబడి తీశారు. సేద్యం కోసం చాలా రకాల పనిముట్లను తయారుచేశారు. పొద్దుతిరుగుడు, మిరప, అరటి సాగులో అనేక ప్రయోగాలు చేశారు. రెండు కిలోల విత్తనాలతో శ్రీవరి సాగు చేసి ఎకరానికి 42 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. నాన్న శ్రమను ప్రభుత్వం గుర్తించింది. కరీంనగర్ కలెక్టర్ ఉత్తమ రైతు అవార్డు ప్రదానం చేశారు. పాలేర్లు, కూలీలు ఉండటం వల్ల చిన్నప్పుడు వ్యవసాయం చేయలేదు. చూశానంతే. వరంగల్లులో బీటెక్ చదివాను. దారి చూపమన్నోళ్లే దారి చూపారు ఉద్యోగం కోసం ఇరవై ఏళ్ల క్రితం హైదరాబాద్ చేరాను. తెలిసినవాళ్లు హాస్పిటల్ పని మీద హైదరాబాద్ వచ్చేవాళ్లు. ఎటు పోవాలో, ఎట్ల పోవాలో అర్థం కాక తోడు రమ్మనేవాళ్లు. చాలామందిని సిటీలోని పెద్ద హాస్పిటల్స్‌కి తీసుకుపోయాను. వచ్చేవాళ్లలో క్యాన్సర్, మరికొన్ని ప్రమాదకరమైన జబ్బులున్నవాళ్లే ఎక్కువ. ఆరుగురు క్యాన్సర్ పేషెంట్లకు వైద్యం చేయించాను. రోగి సమస్యలు, డాక్టర్ సలహాలు వినడం వల్ల క్యాన్సర్ గురించి కొంచెం అవగాహన ఏర్పడింది. రసాయనాలతో కలుషితమైన ఆహారం తినడం వల్ల ఎక్కువమంది క్యాన్సర్ బారినపడుతున్నారని డాక్టర్లు చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావడం వల్ల నాకు ఇంకా తెలుసుకోవాలనే ఆసక్తితో ఇంటర్నెట్‌లో క్యాన్సర్ మూలాలేమిటో తెలుసుకోవడం మొదలుపెట్టాను. ఓసారి తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ ఒక నివేదిక ఇచ్చింది. ప్రపంచంలో తినే ఆహారంలో ఎంతెంత విషం ఉందని చేసిన ఓ అధ్యయనంలో మనిషి ఆహారంతోపాటు ఎంత విషం తింటున్నాడో పరిశీలించింది. ఒక భారతీయుడు రోజుకు సగటున 354 మిల్లీ గ్రాముల విషాన్ని తింటున్నాడని తేలింది. అదే అమెరికాలో ఒక వ్యక్తి సగటున రోజుకు 7 మిల్లీ గ్రాములు. కూరగాయలు, ఆహార పంటల సాగులో వాడే పెస్టిసైడ్స్ వల్ల ఇంత విషం మనం తినాల్సి వస్తోందని నాకు అర్థమైంది. 'సత్యమేవ జయతే' అనే టీవీ కార్యక్రమంలో 'మీరు రసాయనాలు వాడకుండా సేంద్రియ పద్ధతిలో పండించిన ఆహారం విదేశాలకు అమ్ముతున్నారు. రసాయన పురుగు మందులను ఇక్కడి రైతులకు అమ్మతున్నారు. ఇదేమి ద్వంద్వ నీతి' అని ఒక పెస్టిసైడ్స్ కంపెనీ అధిపతిని వ్యాఖ్యాత అమీర్ ఖాన్ ప్రశ్నించారు. 'డిమాండ్‌ని బట్టి బిజినెస్ చేస్తాం. రైతులు కావాలని అడుగుతున్నారు కాబట్టి పురుగు మందులు అమ్ముతున్నాం' అని ఆయన సమాధానం చెప్పారు. అప్పుడు మనం ఎంత తప్పుడు మార్గంలో వ్యవసాయం చేస్తున్నామో అర్థమైంది.

సత్యం తెలిపిన పాలేకర్: వైద్యానికి సహకరించిన ఆరుగురు క్యాన్సర్ బాధితుల్లో నలుగురు చనిపోయారు. అల్లోపతి డాక్టర్లు చనిపోతారని చెప్పిన ఇద్దరు ఆయుర్వేద వైద్యం వల్ల బతికారు. క్యాన్సర్ బారిన పడకుండా నలుగురికి మంచి విషయాలు చెబుదామని ఇంకా అధ్యయనం చేస్తూ పోయాను. సుభాష్ పాలేకర్ ప్రసంగాలు విన్నాను. తెగుళ్లు, కీటకాల నుంచి పంటలను కాపాడుకునేందుకు ఆయన రసాయనాలు లేని పద్ధతులు చెబుతున్నాడు. ఆచరిస్తున్నాడు. భూమిలో సారం లేక పంటమొక్కలు బలహీనం అవుతున్నాయి. అందుకే తెగుళ్లను తట్టుకోలేకపోతున్నాయని, భూమిని బలోపేతం చేయాలని ఆయన చెబుతున్నాడు. పాడి పంట జంటగా సాగాలనేది పాలేకర్ వాదన. తర్వాత వ్యవసాయ శాస్త్రవేత్తలను కలిశాను. పశువులు, పెంట లేకపోవడం వల్ల రైతులు రసాయన ఎరువులను ఉపయోగిస్తున్నారు. అధిక దిగుబడి వచ్చినా, ఆ తర్వాత భూసారం కోల్పోయి నష్టపోతున్నారని వాళ్లుచెప్పారు. పాలేకర్ చెప్పేది సత్యమని అర్థమైంది. గుండెలపై ఆడించిన అనురాగం: నా స్నేహితుడు రాజా రామ్ బస్వపత్రి బెంగళూరులో ఉద్యోగం చేసేవాడు. తన ఆరేళ్ల బిడ్డ క్యాన్సర్ బారినపడిందని చెప్పాడు. ఇద్దరం క్యాన్సర్ గురించి ప్రతి విషయాన్నీ తెలుసుకునేందుకు ఇంటర్నెట్‌లో వెదికాం. చివరికి తన బిడ్డకు క్యాన్సర్‌కి కారణం ఏమిటో తేల్చుకున్నాం. బెంగళూరులో వాళ్లు తింటున్న ఆహారాన్ని ల్యాబ్‌లలో టెస్ట్ చేయించాడు. నూనె, పాలు, కొబ్బరినీళ్లు కలుషితమని తేలింది. కొబ్బరిచెట్టుపై ఉండే కొమ్ము పురుగుని చంపడం కోసం మోనోక్రోటోపాస్‌ని చెట్టు వేర్ల దగ్గర పెడుతున్నారు. అయితే, కొబ్బరినీళ్లు పోసుకునే సమయంలో ఇలా చేయకూడదు. తెలిసినా లాభాల కోసం రైతులు ఇలా చేస్తున్నారు. ఆ కొబ్బరి నీళ్లలో చేరిన కెమికల్స్ వల్ల ఆ పాప క్యాన్సర్ బారిన పడిందని అర్థమైంది. ఎంత ప్రయత్నించినా ఆ బిడ్డను కాపాడుకోలేకపోయాం.

జీవామృతమే అమృతం: సమగ్ర వ్యవసాయ విధానం ఎంచుకుని పని మొదలుపెట్టాను. కొత్త ఒరవడిలో వ్యవసాయం చేయాలని ప్రయోగాలు చేశాను. పాడి, పంట పద్ధతిలో వ్యవసాయానికి పశుపోషణని అనుబంధం చేశాను. సేంద్రియ పద్ధతిలో నేల ఒక్కసారిగా మారదు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215